RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 263 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, ఏప్రిల్,16, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 263 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, April, 16, 2026 | PAGES : 8 RS : 4 /-



## పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

# చేస్తాం

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**సత్తుపల్లి,తెలంగాణ దిశ :** పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట గ్రామంలోని పులిగుండాల ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్‌ను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా బోటింగ్, వాటర్ ఫాల్స్, జంగిల్ సఫారీలను ప్రారంభించారు. సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణం.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ అందమైన ప్రదేశాన్ని పరిచయం చేసిన స్థానిక ఎమ్మెల్యే, డి.ఎఫ్.ఓ. లకు కృతజ్ఞతలు తెలిపారు.



# బీహార్‌లో కొత్త శకం

### తొలి బీజేపీ సీఎంగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

- బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు
- డిప్యూటీ సీఎంలుగా విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్
- రాజ్యసభకు వెళ్లిన నితీశ్ కుమార్.. నాయకత్వ మార్పునకు మార్గం సుగమం

పాట్నా: బీహార్ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర చరిత్రలోనే తొలి సారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమం లో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. సామ్రాట్ చౌదరితో పాటు జేడీయూ సీనియర్ నేతలు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దీంతో రాష్ట్రంలో బీజేపీ ప్రత్యక్ష నాయకత్వానికి మార్గం సుగమమైంది. ప్రమాణ స్వీకారానికి ముందు సామ్రాట్ చౌదరి రాజ్‌వంశీ నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## మహిళాబిల్లు, పునర్విభజన చట్టం


## రెంటికీ లింకుపై విపక్షాల

# ఆందోళన

### పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం

న్యూఢిల్లీ,ఏప్రిల్ 15: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తు న్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ రెంటిని కలపడంపైనా మండిపడు తున్నారు. అలాగే ఇదే విషయమై సామాజిక ఉద్యమకారులు ప్రశ్నించారు. కేంద్రం ఎంపీలకు పంపిణీ చేసిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై వివిధ పక్షాలకు చెందిన నాయకులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులో మొత్తం లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించినప్పటికీ వాటిని రాష్ట్రాల వారీగా ఏ ప్రాతిపాదికన అమలు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు



## మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ వాడీవేడీగా సాగనున్న సమావేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్15 : పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పపడుతున్నాయి.



## అన్న తమ్ముళ్లు కేబినెట్ లో ఉంటే

# తప్పేంటీ..!

### జగ్గారెడ్డి కొత్త లాజిక్..

**మెదక్, ఏప్రిల్ 15,తెలంగాణ దిశ :** మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం డబ్బులు లేకుంటే రాజకీయం లేదని పేర్కొన్నారు. అదే సమయంలో కేబినెట్ విస్తరణకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఇక తనకు పీసీసీ పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా జగ్గారెడ్డి స్పందించారు.రాష్ట్ర రాజకీయాలు, మంత్రి పదవులు, ఎన్నికల్లో ధన ప్రవాహం సహా అనేక అంశాలపై గాంధీ భవన్ వేదికగా మీడియాతో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మంత్రి పదవులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన జగ్గారెడ్డి..
కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరికీ కేబినెట్‌లో చోటు ఉండాలన్నారు. మంత్రి పదవి కావాలంటూ గత కొన్ని రోజులుగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పట్టుబడుతున్న వేళ.. జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ప్రస్తుతం తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రివర్గంలో కొనసాగిస్తూనే.. ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కూడా మంత్రి పదవి ఇవ్వాలని జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరూ కేబినెట్‌లో ఉంటే తప్పేంటని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా తాను ఇదే చెప్తానని స్పష్టం చేశారు. ప్రస్తుత సమయంలో డబ్బులు లేకుండా రాజకీయం లేదని జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు డబ్బు పెడితే వాళ్లే నాయకులు అవుతున్నారని చెప్పారు. ఒక ఎమ్మెల్యేగా గెలవాలి అంటే రూ.100 కోట్లు ఖర్చు అవుతున్నాయని పేర్కొన్నారు.

# బంగ్లా పౌరుల పడవ మునక

### 250 మంది గల్లంతు..ముమ్మర గాలింపు



ఢాకా,ఏప్రిల్15 : అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరం గా గాలింపు చర్యలు కొనసాగుతు న్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్య రాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులుపేర్కొన్నారు.
మలేసియావెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉద్ధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈపడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లా దేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని..



## ఇరాన్‌తో చర్చలకు అమెరికా..

# కొత్త మెలిక

### రెండు కఠిన షరతులు!

- ఇరాన్‌తో చర్చల పునఃప్రారంభానికి రెండు కొత్త షరతులు విధించిన అమెరికా
- హార్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని, లేదంటే ప్రతిచర్య తప్పదని హెచ్చరిక
- ఒప్పందాలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ఆమోదం తప్పనిసరి అని స్పష్టీకరణ
- ఇరాన్ ప్రభుత్వంలో రాజకీయ, సైనిక నాయకత్వాల మధ్య విభేదాలున్నాయని కథనం

వాషింగ్టన్: అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా-ఇరాన్ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌తో చర్చలు పునఃప్రారంభించాలంటే రెండు కఠినమైన షరతులను పాటించాల్సిందేనని అమెరికా స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లో జరగబోయే తదుపరి విడత చర్చలకు ముందే ఈ నిబంధనలను తెరపైకి తెచ్చింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు రెండు రోజుల్లో పునఃప్రారంభమయ్యే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచనప్రాయంగా తెలిపినప్పటికీ, ఈ కొత్త షరతులు సందిగ్ధతకు దారితీస్తున్నాయి.

నల్గొండ,తెలంగాణ దిశ: తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఏప్రిల్ నెల సగం కూ డా గడవకముందే భానుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగు తున్నాయి. సాధారణంగా మే నెలలో ఉండే ఎండలు ఇప్పుడు ఏప్రిల్‌లోనే కనిపిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



# భానుడి ఉగ్రరూపం

### 43 డిగ్రీలు దాటిన ఎండలు

# ఘనంగా చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు







**కీసర, ఏప్రిల్ 15, (తెలంగాణ దిశ)** :శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి వారి అష్టాదశ (18వ) వార్షిక బ్రహ్మోత్సవాలు మహా కుంభాభిషేకం, చక్రస్నానం కార్యక్రమాలతో వైభవంగా ముగిశాయి. భక్తుల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ ఉత్సవాలు ఆలయ ప్రాంగణాన్ని పుణ్యక్షేత్రంగా మార్చాయి. మహా పూర్ణాహుతి అనంతరం స్వామి వారి శతఘటాభిషేకానికి సంబంధించిన మహాకుంభాన్ని ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులకు అందజేశారు. పంచామృతాలు, వివిధ రకాల పవిత్ర జలాలతో స్వామివారికి శతఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్‌కు చక్రస్నానం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఈ వార్షికోత్సవాల్లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ప్రసూన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరి వర్ధన్ రెడ్డి తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మూడు రోజుల పాటు శ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా కేర్ హాస్పిటల్ ద్వారా ఉచిత వైద్య శిబిరం, సోలిస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేపట్టడం విశేషం. ఈ బ్రహ్మోత్సవాల విజయవంతానికి సహకరించిన పారిశుధ్య కార్మికులు, హాస్పిటల్ సిబ్బంది, పోలీసులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్ వాడి టీచర్లకు నూతన సెల్ ఫోన్లు అందజేత



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 15, (తెలంగాణ దిశ)** : అంగన్వాడి టీచర్లకు నూతన సెల్ ఫోన్ లను బుధవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అందజేశారు. పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీడీపీవో అధికారిణి రేణుక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ లోని దాదాపు 190 మంది అంగన్ వాడి టీచర్లకు నూతన సెల్ ఫోన్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు కృష్ణప్రియ, భాగ్య, జ్యోతి, వరలక్ష్మి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 15, (తెలంగాణ దిశ)** :హైదరాబాద్ వేదికగా జర్నలిస్టులు జాతీయ స్థాయి సమావేశాలు నిర్వహించడం అభినందనీయమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కాటారం మండలం ధన్వాడలో బుధవారం ఈ నెల 23, 24 తేదీలలో జరగనున్న నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) (ఎన్‌యూజే(ఐ) జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు ప్రతినిధులు పాల్గొనేలా హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సమావేశాలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్రానికి గౌరవంగా నిలుస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలపై చర్చించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, కార్యక్రమ నిర్వాహకులైన



టీఎస్‌జేయూ రాష్ట్ర, జిల్లా కమిటీలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల జనార్ధన్, గట్టు రవీందర్, ధన్వాడ సర్పంచ్ చీటూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్‌కు ఘన సన్మానం

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 15, (తెలంగాణ దిశ)** : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నూతనంగా నియమితులైన కూన శ్రీనివాస్ గౌడ్ ను పార్టీ నాయకులు కార్యకర్తలు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో సన్నిహితులు, అభిమానులు చేరుకుని పూలమాలలతో, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూన శ్రీనివాస్ గౌడ్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నేమూరి రాములు గౌడ్, వెంకటేష్



గౌడ్, చిట్టిబాబు శ్రీనివాస్, బాలప్ప, శ్రీనివాస్ రెడ్డి, శ్రీరాములు రమేష్ గౌడ్, వెంకటేష్ (జర్నలిస్ట్) తదితరులు పాల్గొన్నారు.

# ధర్మం గెలిచింది -- ప్రభుత్వ భూమి తిరిగి స్వాధీనం




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 15, (తెలంగాణ దిశ)** :మేడ్చల్ జిల్లా పరిధిలోని భౌరంపేట సర్వే నంబర్ 166/1లో ఉన్న సుమారు 5 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిపై జరిగిన అక్రమ ఆక్రమణ వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ భూమిని కొంతమంది అక్రమంగా ఆక్రమించి, తప్పుడు ఉత్తర్వులతో సక్రమం చేసుకునే ప్రయత్నం చేసినట్లు ఆకుల సతీష్ టీం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశాల మేరకు గతంలో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేశారు. దీంతో దుండిగల్ తహసిల్దార్ రాజేశ్వర్




రెడ్డి తక్షణమే స్పందించి, సంబంధిత భూమిని ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకుని అక్కడ బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో భాగంగా స్పందించిన కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ విజేందర్ రెడ్డితో పాటు రెవెన్యూ అధికారులకు ఆకుల సతీష్ టీం కృతజ్ఞతలు తెలియజేసింది. "ధర్మం గెలిచింది, అక్రమార్కుల పాపం పండింది" అంటూ ఆకుల సతీష్ పేర్కొన్నారు.

# 5 గ్రామాలు.. తెలంగాణలో కలిపేదెలా?



**భద్రాచలం,తెలంగాణ దిశ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఐదు గ్రామాల విలీన అంశం మళ్ళీ రాజకీయంగా సెంటర్ స్టేజ్‌లోకి వచ్చింది. భద్రాచలం పుణ్యక్షేత్రం చుట్టూ ఉన్న ఈ గ్రామాలు ప్రస్తుతం ఏపీలో ఉండటం, భౌగోళికంగా అవి భద్రాద్రితో విడదీయలేని భాగం కావడం ఈ వివాదానికి మూలం. పాలనా పరంగా, వరదల సమయంలోనూ వారు ఇబ్బంది పడుతున్నారు. అందుకే తమ గ్రామాలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా దీన్ని ఎన్నికల హామీగా మార్చాయి. భద్రాద్రి రక్షణ: తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని కేంద్రానికి లేఖ రాశారు. అంతకుముందు ఎంపీ రేణుకా చౌదరి అమరావతికి మద్దతు తెలుపుతూనే ఈ గ్రామాల ప్రస్తావన తీసుకువచ్చారు ఈ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని కోరడానికి ప్రధాన కారణం భద్రాచలం రక్షణ. గోదావరికి వరదలు వచ్చినప్పుడు ఈ గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఇవి ఏపీలో ఉండటం వల్ల తెలంగాణ ప్రభుత్వం అక్కడ శాశ్వత రక్షణ చర్యలు చేపట్టలేకపోతోంది. అటు ఏపీ ప్రభుత్వం కూడా వీటిపై పెద్దగా దృష్టి సారించడం లేదు. అందుకే, ఈ గ్రామాలు తెలంగాణలో కలిస్తేనే భద్రాద్రికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడం సాధ్యమవుతుందని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది.

ఆ గ్రామాలపై ఏపీ వైఖరేంటి?: ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయంలో పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ గ్రామాల ప్రజలు కూడా తెలంగాణలో కలవాలని కోరుకుంటూ ఉద్యమాలు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ముంపు ప్రాంతాలు కాని పక్షంలో, ఆ భూములను తెలంగాణకు అప్పగించడానికి ఏపీకి పెద్దగా ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు.

విలీన ప్రక్రియ-అంత సులభం కాదు!: రాజకీయంగా హామీలు ఇవ్వడం సులభమే కానీ, ప్రాసెస్ పరంగా ఇది అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దుల మార్పు అనేది కేవలం రాష్ట్రాల మధ్య ఒప్పందంతో ముగిసేది కాదు.

ముందుగా రెండు రాష్ట్రాల అసెంబ్లీలు ఈ విలీనానికి ఆమోదం తెలుపుతూ తీర్మానాలు చేయాలి. రాష్ట్రాల తీర్మానాల ఆధారంగా కేంద్ర హోం శాఖ ఒక ముసాయిదాను సిద్ధం చేయాలి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, పార్లమెంట్‌లో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టానికి సవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాతే అధికారికంగా విలీనం జరుగుతుంది. ప్రస్తుతం బంతి కేంద్ర ప్రభుత్వం కోర్టులో ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి, ఏపీని ఒప్పించగలిగితేనే ఈ ఐదు గ్రామాల విలీనం సాధ్యమవుతుంది.

# కుషాయిగూడలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కుషాయిగూడ, ఏప్రిల్ 15, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం కుషాయిగూడ పోలీసులు రాత్రి సమయంలో విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ చేస్తుండగా, పెట్రోల్ మొబైల్ వన్ ఇన్‌చార్జ్ జి. రమేష్, డ్రైవర్ ఎస్‌పీ సురేష్ కుమార్‌లకు రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో 100 డయల్ కాల్ వచ్చింది. సమాచారం మేరకు వారు కందిగూడలోని మాణిక్ సాయి ఎన్ క్లేవ్ వద్దకు చేరుకుని పరిశీలించగా, సుమారు 30 నుండి 40 సంవత్సరాల వయస్సు గల ఒక వ్యక్తి కింద పడి ఉన్నాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, అక్కడికి చేరుకున్న వైద్య సిబ్బంది అతన్ని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. స్థానికులను విచారించగా, ఆ వ్యక్తి కొంతసేపటి నుంచి పార్క్ కాంపౌండ్ గోడపై కూర్చొని మద్యం సేవిస్తూ ఉండినట్లు తెలిపారు. మద్యం మత్తులో ముందుకు వాలి కిందపడి పోవడంతో తలకు గాయమై ఉండవచ్చని, ప్రమాదవశాత్తు మృతి చెందినట్టు అనుమానం



వ్యక్తమవుతోంది. మృతుడిని పోలీసులు గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడు ఆకుపచ్చ రంగు టీషర్ట్, నలుపు జీన్స్ ప్యాంట్, నలుపు బెల్ట్ ధరించి ఉన్నాడు. అతని ఎత్తు సుమారు 5.6 అడుగులు ఉండగా, చామనచాయ రంగులో ఉన్నాడు. ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# చిత్తూరు-తచ్చూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే



**తిరుపతి,తెలంగాణ దిశ :** ఏపీలో ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే రెడీ అయ్యింది.. ఈ మేరకు అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. చిత్తూరు నుంచి తమిళనాడులోని తచ్చూరు వరకు 116 కిలోమీటర్ల హైవే అందుబాటులోకి రానుంది. ఈ హైవే 116 కిలోమీటర్లలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఏకంగా 95 కిలోమీటర్లు ఉంది. ఈ హైవేను బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి అనుసంధానం చేశారు అధికారులు. ఆంధ్రప్రదేశ్‌లో మరో గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు నుంచి తమిళనాడును కనెక్ట్ చేసే.. చిత్తూరు-తచ్చూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ట్రయల్ రన్ నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఈ హైవేపైకి వాహనాలను అనునమతించారు. ఈ హైవేలో సుమారు 100 కి.మీ వేగంతో వెళితే దాదాపు గంటన్నరలోనే తమిళనాడుకు, పోర్టుకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేశారు. త్వరలోనే ఈ హైవేపైకి వాహనాలను పూరిస్థాయిలో అనుమతించనున్నారు.. టోల్ రుసుము వసూలు చేయనున్నారు. ఈ హైవే మొత్తం 116 కిలోమీటర్లు ఆరు లైన్లుగా ఉంటే.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే 95 కిలో మీటర్లు ఉంది.. మిగిలిన 21 కిలోమీటర్లు తమిళనాడులో ఉంది. చిత్తూరులోని మాపాక్షి దగ్గర ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభమవుతుంది.. ఆ తర్వాత గంగాధర నెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, నగరి మీదుగా కొనసాగుతుంది. అక్కడి నుంచి తమిళనాడులోని ఎంటర్రై ఊతుకోట్టై వరకు.. మళ్లీ అక్కడినుంచి కట్టుపల్లి పోర్టు వరకు హైవే ఉంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను కర్ణాటక నుంచి వచ్చే భారీ వాహనాలు తమిళనాడులోని పోర్టుకు చేరుకునేందుకు వీలుగా నిర్మించారు. ఈ హైవేలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు చిత్తూరు, గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం, నగరి దగ్గర మాత్రమే ఉంటాయి. నగరి, ఎస్‌ఆర్‌పురం, అనుపల్లె, అరతల, నరసింహాపురం, పల్లిపట్టు, ఊతుకోట, కుమారరాజపేట, వీరకావేరి రాజపురం, పొందవాక్కం దగ్గర ఇంటర్ చేంజ్‌లు ఉంటాయి. ఈ హైవే దాదాపుగా పనులన్నీ పూర్తి కావడంతో ట్రయల్ రన్ నిర్వహిం చారు. త్వరలోనే ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేపైకి వాహనాలను అనుమతించను న్నారు. ఈ గచిత్తూరు- తచ్చూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్ని 2022లో రూ. 4వేలఅంచనా వ్యయంతో నాలుగు ప్యాకేజీలుగా విభ జించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి కనెక్ట్ చేశారు. ఈ హైవేతో చెన్నై, బెంగళూరు వెళ్లేవారికి ఊరట దక్కింది. బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే కూడా చిత్తూరు మీదుగా వెళుతోంది. ఇప్పటికే ఈ హైవేలో బెంగళూరు- వి.కోట మధ్య రాకపో కలకు అనుమతించారు. మొగిలి ఘాట్ దగ్గర పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ లోపు ఆ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు.

# పోటీ ప్రపంచంలో ఐఐటి విద్య ఎంతో దోహదం

## - గాయత్రి పాఠశాల విద్యార్థులను అభినందించిన ఎంపీడీఓ



**వలిగొండ, ఏప్రిల్ 15, (తెలంగాణ దిశ)** :మండల కేంద్రంలోని గాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఐఐటి విద్యార్థులను మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఐఐటి విద్య పట్టణాలకు మాత్రమే పరిమితమై అధిక వ్యయంతో కూడుకున్నదిగా ఉండేదని, అయితే ఇప్పుడు ఆ విద్యను మండల స్థాయికి తీసుకువచ్చిన ఘనత గాయత్రి పాఠశాలకు దక్కిందని కొనియాడారు. రాబోయే పోటీ ప్రపంచంలో నిలబడటానికి ఐఐటి విద్య ఎంతో దోహదపడుతుందని, విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి హైస్కూల్ చైర్మన్ తవటం నరహరి, వైస్ చైర్మన్ పనుమటి మురళీధర్ రెడ్డి, కరస్పాండెంట్ భీమిడి యాదిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కొంతం బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకుర్ల వెంకటేశం, ప్రిన్సిపల్ అనురాధ, భీమిడి కవిత, రమాదేవి, ఐఐటి ఉపాధ్యాయులు ముత్యాల స్వామి, సాయి తేజ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల !

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమురు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాధంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది.ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావంతులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు.

# కీసరలో అక్రమ షెడ్ల హడావిడి..

# అధికారుల మౌనం..?

## ప్రధాన రహదారుల వెంట అనుమతి లేకుండా నిర్మాణాల జోరు..







**కీసర, ఏప్రిల్ 15, (తెలంగాణ దిశ):** కీసర సర్కిల్ పరిధిలో అక్రమ షెడ్ నిర్మాణాలు విస్తృతంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కీసర డివిజన్ పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా భారీ షెడ్లు, వాణిజ్య నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కీసర సర్కిల్ అక్రమ నిర్మాణాలకు కేంద్రంగా మారుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. నగర పునర్విభజన తర్వాత కీసర సర్కిల్ ఏర్పాటు చేసి అధికారులు బాధ్యతలు స్వీకరించినప్పటికీ, అక్రమ నిర్మాణాలపై కట్టడి కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కీసర ప్రధాన చౌరస్తా నుండి ప్రధాన రహదారి వెంట, ఎంఆర్ఎఫ్ టైర్స్ షోరూం ఎదురుగా అనుమతులు లేకుండా భారీ షెడ్ నిర్మాణం జరుగుతుండటం ఉదాహరణగా చూపిస్తున్నారు. అదే విధంగా పెద్దమ్మ టెంపుల్ సమీపంలో గృహ నిర్మాణ అనుమతులతో వాణిజ్య సముదాయాల నిర్మాణం జరుగుతుండగా, రాంపల్లి దయారా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కూడా భారీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో కీసర టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించినప్పటికీ, ఆ తర్వాత నిర్మాణాలు నిర్మొహమాటంగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది ప్రభావశీలుల మద్దతుతోనే ఈ నిర్మాణాలు నిర్భయంగా కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాల్లో ఇలాంటి నిర్మాణాలు పెరగడం వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారే అవకాశం ఉందని, పట్టణ ప్రణాళికకు కూడా ఇబ్బందులు తలెత్తవచ్చునని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కీసర ప్రాంతం పూర్తిగా అక్రమ నిర్మాణాల కేంద్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.





# యుద్ధం నేర్పిన ఆటలు





పిల్లలు ఏం తింటున్నారు, ఏం వింటున్నారు, ఏం ఆలోచిస్తున్నారు.. అన్నదానిపైనే వాళ్ల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందుకే పిల్లల చుట్టూ సానుకూల వాతావరణం ఉండాలంటారు. కానీ ప్రపంచంలో చాలామంది పిల్లలు అలాంటి వాతా వరణంలో పెరగడం లేదు. ఆకలి, పేదరికంలో పెరుగుతున్న పిల్లలకు ఏం తెలుస్తుంది? అంటే సమాధానం దొరుకు తుంది. కానీ, బాంబు మోతలతో, శిథిలాల మధ్య దినదినగండంలా బతుకుతున్న పిల్లలు ఏం చేస్తారు? అంటే చెప్పడం చాలా కష్టం. ఆ పిల్లలు బాల్యంలో ఎదురవ్వకూడని ఎన్నో సంఘటనలకు ప్రత్యక్ష సాక్షులు. చూడకూడని, వినకూడని ఎన్నో దారుణాలకు బలి పశువులు. గాజా, ఇరాన్, ఉక్రెయిన్, లెబనాన్, సూడాన్ వంటి అనేక దేశాలు భీకర బాంబు దాడులతో దద్దరిల్లుతున్న వేళ .. అక్కడి పిల్లలు ఆ యుద్ధ భయంకర దృశ్యాలనే తమ ఆటల్లో భాగం చేసుకుంటున్న వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ పిల్లలు ఆహ్లాదం కోసం ఆ ఆటలు ఆడడం లేదు. 'ఎంత భయంకర పరిస్థితుల్లో తాము జీవిస్తున్నామో' అనే విషయాన్ని ఆటల ద్వారా ప్రపంచానికి చూపిస్తున్నారు. యుద్ధాల్లో మరణించిన పిల్లలు, దాడుల వల్ల అవయవాలు కోల్పోయిన పిల్లలు .. శరణార్థ శిబిరాల్లో తలదాచుకుంటున్న పిల్లలు .. జీవం ఉన్న వారు, లేనివారు .. ఇప్పుడు ఈ పిల్లలందరూ ప్రపంచం ముందు సమాధానం లేని ప్రశ్నలుగా మిగిలిపోయారు. ఆకలి వేసినప్పుడు ఒక ముక్క రొట్టె దొరకడం, దాహం వేసినప్పుడు గుక్కెడు నీళ్లు పొందడం ఆ చిన్నారులకు విలాసంగా మారిపోయింది.

**వాళ్ల కడుపు నిండదని తెలిసినా..:** ఈ పరిస్థితుల్లో ఆకలితో పేగులు అంటుకుపోతున్న పిల్లలు ఆ బాధ నుండి ఉపశమనం కోసం ఓ ఆట ఆడుకున్న వీడియో ఒకటి గతేడాది వైరల్ అయ్యింది. వీడియోలో కనిపించిన దృశ్యం ఇలా ఉంది. గుంపుగా కూర్చొన్న పిల్లలకు ఒక చిన్నారి తన దగ్గర ఉన్న సంచి నుండి కొన్ని ఆహార పదార్థాలు తీసి ఇచ్చింది. అవి రొట్టెలు, బర్గర్లు, చాక్లెట్లు, బిస్కెట్లు, జ్యూస్ ప్యాకెట్ల రూపంలో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు. చుట్టూ ఉన్న పిల్లలు వాటిని ఎంతో ఇష్టంగా తింటున్నట్లు నటిస్తున్నారు. 'అవి ఎంత తిన్నా వాళ్ల కడుపు నిండదు' అని వాళ్లకు తెలుసు. అయినా సరే ఆ క్షణం అదే ఆహారంగా భావించి లొట్టలు వేసు కుంటూ ఒకరికొకరు తినిపించుకుంటూ ఆట ఆడారు. మధ్య మధ్యలో ఒక చిన్నారి తన కోసం అమ్మ ఏదైనా రొట్టె తెచ్చిందేమో అని ఆశగా అటువైపు చూడడం కూడా కనిపిస్తోంది. ఎంత బాధాకరమైన పరిస్థితి ఇది.

**ఎక్కువ కిటికీలు ఉంటే నన్ను పట్టుకోలేరు:** గతేడాది అంతర్జాతీయ పత్రికల్లో యుద్ధం పిల్లల ఆటలను ఎలా ప్రభావితం చేస్తుందో అన్నదానిపై కథనాలు ప్రచురితం అయ్యాయి. అందులో రోహింగ్యా బాలిక ఆడిన ఆటను ఇప్పుడు గుర్తుచేసుకుందాం. మట్టితో ఒక ఇల్లును కట్టుకుని ఆ పాప ఆడుకుంటోంది. ఆ ఇంటికి చాలా తలుపులు పెట్టింది. 'ఇన్ని ఎందుకు పెట్టావు?' అని అక్కడే ఉన్న ఒకామె అడిగింది. 'ఎందుకంటే నన్ను ఎవరైనా టార్చర్ చెయ్యాలని వస్తే ఇన్ని తలుపుల మధ్య ఉన్న ఇంట్లో నేను ఎక్కడ ఉన్నానో వాళ్లకు తెలియదు కదా!' అందుకే ..' అని చెప్పింది. శిబిరాల్లో తలదాచుకున్న పిల్లలకు ఆకలి, దప్పికలే కాదు లైంగిక హింస కూడా ఎంతలా వేధిస్తుందో అనడానికి ఇంతకంటే ఉదాహరణ అక్కర్లేదు. ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో బాధితులైన పిల్లలు ఇలా ఆడుకుంటున్నారు. దాగుడు మూతల ఆటలో రెండు వర్గాలుగా పిల్లలు చీలిపోయారు. ఆ వర్గాలకు ఉక్రెయిన్, రష్యా పేర్లు పెట్టారు. ఒకరికి ఒకరు దొరక్కుండా ఆడుకున్న ఈ ఆటలో దొరికిన పిల్లవాడి (ఏ వర్గమైనా)ని, పట్టుకున్న పిల్లలు అంతా తుపాకులతో కాల్చడం, కొట్టడం, ఈడ్చుకుని వెళ్లడం లాగా నటిస్తూ ఆడుకున్నారు. 'ఈ దృశ్యం వాళ్లకు నిత్యం కనిపిస్తున్నదానికి ప్రతిబింబం' అని ఆర్టికల్‌లో రాశారు.

**అంబులెన్స్ ఆట:** ఇటీవల గాజాలో పిల్లలు బొమ్మతో ఆడిన అంబులెన్స్ ఆట మనసున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించేలా ఉంది. చిన్న చిన్న పిల్లలు ఒక ఇనుప స్ట్రక్చర్‌పై బొమ్మను పడుకోబెట్టి మోసుకుంటూ వెళున్నారు. ఆ స్ట్రక్చర్‌ను అటూ ఇటూ లాగుతూ, గట్టిగా పట్టుకుని ఒక చోట పెట్టారు. ప్రాణాలు కోల్పోయిన వారిని, అవయవాలు తెగిపడి గాయాల పాలైన క్షతగాత్రులను స్ట్రక్చర్లపై తీసుకెళ్లడం నిత్యం చూస్తున్న ఆ పిల్లలు ఆ విషాదాన్నే తమ ఆటగా చేసుకున్నారు. 'యుద్ధం పిల్లల బాల్యాన్ని తుడిచిపెట్టేస్తోంది' అని చాలాసార్లు చెప్పుకున్నాం. వాళ్లకు విద్యను దూరం చేస్తోందని, ఆకలితో అలమటించేలా చేస్తోందని బాధపడ్డాం. కాలే కడుపులతో రొట్టెల కోసం ఎగబడుతున్న పిల్లల వీడియోలు, నీళ్ల కోసం పెద్ద పెద్ద క్యానులు మోస్తున్న చిన్నారుల దృశ్యాలు అనేకం వైరల్ అయినా .. యుద్ధాన్నే ఆటగా మార్చుకుని ఆడుకోవడం మాత్రం చాలా చాలా బాధాకరం.


# మిర్చి ధర పైపైకి..

**ఒక్కరోజే రూ.2,400 చొప్పున పెరిగిన ధర**
**సరుకు పెరిగినా ఇదే ధర ఉండాలని కోరుకుంటున్న రైతులు**



**రఘునాథపాలెం,తెలంగాణ దిశ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర పైపైకి వెళ్తున్నది. మంగళవారంతో పోల్చితే ఒక్క రోజులోనే భారీగా ధర పెరిగింది. ఈ ఏడాది ఇదే అధిక పెరుగుదల అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. క్వింటా ఏసీ మిర్చి ధర రూ.20,200, కొత్త మిర్చి ధర రూ.20 వేలకు చేరింది. దీంతో పంట విక్రయానికి తరలించిన రైతుల్లో ఆశలు చిగురించాయి. వారం రోజుల క్రితం వరకు పోల్చితే మిర్చి ధర కేవలం రూ.15 వేలకే పరిమితమైంది. అయితే రెండు రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన మిర్చి ధర బుధవారం నాటికి రూ.20 వేల మార్క్‌ను చేరింది. వ్యవసాయ మార్కెట్‌కు కొత్త మిర్చి భారీగా వస్తుండడంతో ధరలో పురోగతి కనిపిస్తున్నది. 2024లో మిర్చి క్వింటా ధర రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. రెండేళ్లుగా తెలంగాణ మిర్చికి విదేశాల్లో డిమాండ్ లేకపోవడంతో ధర భారీగా పడిపోయింది. కాగా, ఈ ఏడాది తెగుళ్ళ, అధిక వర్షాల కారణంగా దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఏటా లక్ష ఎకరాల్లో సాగయ్యే మిర్చి.. ఈ ఏడాది కేవలం 40 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఈ క్రమంలో దిగుబడులు తగ్గడంతో విదేశీ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ పెరిగింది. కాగా, బుధవారం ఖమ్మం మార్కెట్‌కు 13 వేల బస్తాలు వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. సీజన్‌లో మార్కెట్‌కు వచ్చే సరుకు పెరిగినప్పటికీ ఇదే ధర నిలకడగా ఉండాలని రైతులు కోరుతున్నారు.

# సామ్రాజ్యవాద పెనుముప్పు




అమెరికా సామ్రాజ్యవాదం బుసలుకొడుతోంది. నిన్న వెనిజులాపై ఆకస్మిక దాడి చేసి, వందలాదిమందిని హత్య చేసి, అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను అర్ధరాత్రి వేళ సైనిక విమానంలో ఎత్తుకెళ్లడం, నేడు గ్రీన్‌లాండ్స్‌ను కబళించేందుకు సిద్ధం కావడం, ఇరాన్, క్యూబా, మెక్సికో, కొలంబియా లాంటి దేశాలపై బెదిరింపులకు దిగడం× ఇవన్నీ సామ్రాజ్యవాద వికృతరూపానికి ఆనవాళ్లు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుతో పాటు అగ్రరాజ్య దురహంకారానికి ప్రతిరూపాలే.

ప్రస్తుతం గ్రీన్‌లాండ్‌పై యుద్ధ మేఘాలు ఆవరించాయి. ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు సైనిక విమానం పంపుతున్నట్టు ఇప్పటికే అమెరికా ప్రకటించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన ఈ దీవిలో అత్యంత అరుదైనవిగా ప్రకటించిన 34 ఖనిజాల్లో గ్రాఫైట్, లిథియం వంటి 25 ఖనిజాలు అపారంగా ఇక్కడ ఉన్నాయి. విద్యుత్ వాహనాల తయారీలో చాలా కీలకమైన వీటిని, చమురు, సహజ వాయువును వెలికితీస్తే పర్యావరణానికి ముప్పేనన్న స్పృహతో అక్కడి ప్రభుత్వం 2019 నుంచి నిషేధం విధించింది. వీటన్నింటినీ చేజిక్కించుకునేందుకే రష్యా, చైనా బూచి చూపడం సహా ట్రంప్ వాచాలత. అభ్యంతరం చెప్పిన యూరోపియన్ యూని యన్ దేశాలపై వచ్చే నెల 1 నుంచి 10 శాతం సుంకాలు విధిస్తాననడం కయ్యానికి కాలుదువ్వడమే!

గాజా పునర్నిర్మాణం కోసమంటూ తాను శాశ్వత అధ్యక్షుడిగా శాంతి మండలి ఏర్పాటు చేస్తాననడం, దానికి మనదేశం సహా 60 దేశాలను ఆహ్వానించడం మరో ప్రమాదక ర పోకడ. తలా తోకా లేకుండా ఐక్యరాజ్య సమితిని నిర్వీర్యం చేసేలా ఉన్న ఈ ఎత్తుగడ గాజా వాసులకు సహాయం అందకుండా చేసి తరిమేయడానికి, జాతి నిర్మూలనకు, ఆ ఆనవాళ్లు చెరిపేయడానికే.

మెరికా ఆంక్షలతో ఇరాన్, రష్యా, వెనిజులా తదితర దేశాలు వివిధ కరెన్సీల్లో చమురు అమ్మకాలు జరపడంతో డాలర్ ఆధిపత్యానికి కొంతమేర గండిపడటం, వాణిజ్యలోటు అంతకంతకూ పెరిగిపోతుండటం, ప్రపంచంలోనే అతిపెద్ద రుణగ్రస్థ దేశంగా కొనసాగుతుండటం లాంటి సవాళ్లను అధిగమించడానికి అగ్రరాజ్యం విధ్వంసకర ఎత్తుగడలకు పూనుకోవడం గర్హనీయం. ఒకప్పుడు తన వలసలుగా ఉన్న దేశాల్లోని సంపదనంతా తరలించుకుపోయిన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల తరహాలోనే× ప్రపంచంపై పెత్తనం చేయాలనుకోవడం ఆందోళనకరం. దిగుమతులపై అధిక సుంకాలు విధించడం, చమురు, సహజవాయువు లాంటి ఇంధనాలను నిల్వవుంచుకునే పద్ధతికి భిన్నంగా అమ్మకాలు జరపడం, విలువైన వనరులున్న దేశాలను నయా వలసలుగా చేసుకుని, వాటిని కొల్లగొట్టడం, ఇజ్రాయిల్ ద్వారా మధ్యప్రాచ్యమంతటా మంటలు రాజేయడం, వెనిజులాకు తానే అధ్యక్షుడినని ట్రంప్ ప్రకటించుకోవడం, ఇరాన్‌లో పాలకులను మార్చేస్తాననడం, క్యూబాకు అమెరికా విదేశాంగ మంత్రి అధ్యక్షుడు అవుతాడనడం ఇవన్నీ అందులో భాగమే. ఒకప్పుడు సామ్రాజ్యవాద దురహంకారాన్ని నిలువరించిన సోవియట్ యూనియన్‌లా బలమైన సోషలిస్టు శిబిరం లేకపోవడంతో అమెరికా ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. లాటిన్ అమెరికాకో, ఇయుకో పరిమితమవుతుందనుకుని చేష్టలుడిగి కూర్చుంటే× మూడో ప్రపంచ దేశాలకూ యుద్ధ మేఘాలు విస్తరించే ప్రమాదం పొంచివుంది. ఎన్ని మాటలన్నా, సరైన పత్రాల్లేవంటూ ప్రవాస భారతీయులను సంకెళ్లు వేసి, గొలుసులతో బంధించి అవమానకరంగా యుద్ధ విమానాల్లో తరలించినా, ఎడాపెడా సుంకాలు విధించి దేశానికి తీరని నష్టం కలిగిస్తున్నా, నిత్యం బెదిరింపులకు పాల్పడుతున్నా మన పాలకులు నోరుమెదపక పోవడం సిగ్గుచేటు. అమెరికా దురహంకార, ఆధిపత్య చర్యలను ఇకనైనా భారత్ ప్రతిఘటించాలి. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, దేశాల స్వాతం(త్యాన్ని కాలరాస్తూ× ప్రపంచాన్ని పెనువిపత్తు దిశగా తీసుకెళ్తున్న సామ్రాజ్యవాద దురహంకారాన్ని తుదముట్టించడం అత్యావశ్యకం. అందుకు భిన్నంగా వ్యవహరించిన దేశాలను, పాలకులను భవిష్యత్ తరాలు, చరిత్ర క్షమించవు.

## మురికి కాలువలు శుభ్రపరచాలి



**కమాన్ పూర్ ,తెలంగాణ దిశ :** మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి అని పెంచికలపేట సర్పంచ్ పల్లె మాధవి నారాయణ అన్నారు. గురువారం కమాన్ పూర్ మండలంలోని పెంచల పేట రెండో వార్డులో మురికి కాలువలు పూర్తిగా చెత్తాచెదారంతో కూరుకుపోయాయి. దీంతో సర్పంచ్ పల్లె మాధవి నారాయణ ఆదేశాలతో గ్రామ కార్యదర్శి సూది రెడ్డి ప్రవళిక ఆధ్వర్యంలో కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని పూర్తిగా తొలగించారు. అలాగే గ్రామంలో చెత్తాచెదారం లేకుండా చూస్తామని ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించాలని మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని సర్పంచ్ సూచించారు. ఆయా పనులను ఉపసర్పంచ్ చొప్పరి శేఖర్ పరిశీలించారు.

# వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి




**విజయనగరం,తెలంగాణ దిశ :**ప్రస్తుతం వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి పెరుగుతోందన్న మాట ఆ పార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై పైచేయి సాధించేందుకు ఎంచుకున్న వ్యూహాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదని వారు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం వైసీపీ చేస్తోందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇవన్నీ గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటికి క్రెడిట్ తీసుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారు.అయితే ఈ ప్రచారం ప్రజల్లో పెద్దగా ప్రభావం చూపడం లేదని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. ఏ పని చేసినా అది జరిగినప్పుడే చెప్పుకోవాలి అన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందని అంటున్నారు. నిజంగా ఆ పనులు అప్పట్లో జరిగి ఉంటే, అప్పుడే వాటిని ప్రజల ముందు బలంగా ఉంచాల్సిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఆలస్యంగా చెప్పుకుంటున్న మాటలకు ప్రజలు పెద్దగా స్పందించడం లేదని వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంకొక వైపు సోషల్ మీడియా ప్రచారం కూడా పార్టీకి కలిసి రావడం లేదన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటున్న కార్యక్రమాల్లో చేసిన వ్యాఖ్యలను కోట్ చేస్తూ, వాటిని వక్రీకరించి పోస్టులు పెట్టడం ద్వారా లాభం ఉంటుందని భావించారు. కానీ ఈ ప్రయత్నం కూడా ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని నేతలే చెబుతున్నారు. ఇలాంటి అనుచిత ప్రచారం వల్ల ప్రభుత్వానికి నష్టం కంటే, తమకే నష్టం జరుగుతోందన్న భావన పార్టీ లోపల పెరుగుతోంది.మొత్తంగా చూస్తే వైసీపీ ఎంచుకున్న రాజకీయ ఎత్తులు పనిచేయడం లేదన్న భావన బలపడుతోంది. ఇదే సమయంలో పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న నాయకుల సంఖ్య కూడా పెరుగుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ముందుగా వీరిని నిలువరించాల్సిన అవసరం ఉందని కొందరు సూచిస్తున్నా, అధిష్టానం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. పోయేవారు పోతే పోనీయండి అన్న ధోరణి కొనసాగుతుండటంతో మిగిలిన నాయకుల్లోనూ నిరాశ పెరుగుతోంది.ఈ పరిస్థితుల్లో చిన్న అవకాశం దొరికినా పార్టీ వీడేందుకు సిద్ధంగా ఉన్నామని కొందరు బహిరంగంగానే చెబుతున్నారని సమాచారం. ఒకప్పుడు బలమైన కేడర్, స్పష్టమైన వ్యూహాలతో ముందుకు సాగిన పార్టీ ఇప్పుడు అయోమయంలో ఉందన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందాలంటే కేవలం ప్రచారంతో కాకుండా, స్పష్టమైన దిశానిర్దేశం, నాయకత్వ నిర్ణయాలు అవసరమన్న చర్చ వైసీపీ వర్గాల్లోనే సాగుతోంది.ఇదిలా ఉండగా, గత ఎన్నికల సమయంలోనే తాను మళ్లీ పోటీ చేయబోనని నాని ప్రకటించారు. తన సోదరుడి కుమారుడిని రాజకీయ వారసుడిగా సూచించినా, పార్టీ పెద్దల ఆలోచన వేరేలా ఉన్నట్లు తెలుస్తోంది. నానిని నియోజకవర్గ రాజకీ యాల నుంచితప్పించి, పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలన్న అభిప్రాయంఉన్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. 2029 ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే, ఆయనకు రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటి పదవులు దక్కే అవకాశముందన్న ప్రచారం కొనసాగుతోంది. ఇందులో ఎంత నిజం ఉందో రానున్న రోజుల్లో తేలాల్సి ఉంది.

# లోక్‌పాల్ తోనే రాజకీయ అవినీతికి అడ్డుకట్ట !

త్వం శుంఠ అంటే.. త్వం శుంఠ అన్నట్లుగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు నడుస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి తెగించడం..వేలకోట్లు సంపాదించడం..అధికారం పోయాక, అధికారంలో ఉన్న పార్టీల అవినీతి గురించి ప్రశ్నించడం చూస్తున్నాం. అధికారంలో ఉన్న వారు, అధికారంలో ఉండి విపక్షం లోకి వచ్చిన వారు చేసిన అవినీతి వల్ల ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కోలుకోలేని అప్పుల్లో కూరుకుని పోయాయి. ఇది వాస్తవం. విభజన వల్ల జరిగిన మేలు ఇదే. ఇందుకు నాలుగు పార్టీల నాయకులు బాధ్యులు. బిఆర్‌ఎస్‌గా మారిన టిఆర్‌ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలు ఈ అప్పులకు బాధ్యత వహించాలి. తెలుగు రాష్ట్రాల అప్పులను ఈ పార్టీల నుంచి వసూలు చేయాలి. అప్పుడే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుండి బయటపడతాయి. ఇకపోతే నేతలకు సవాళ్లు విసురకోవడం అలవాటుగా మారింది. అధికారంలో ఉండగా తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలను నిందస్తున్నారు. ఇందులో ఎవ్వరేమీ తక్కువ తినలేదు. అందుకే రాజకీయ అవినీతిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి. సాధారణ పోలీసులతో ఇది సాధ్యం కాదు. ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలి. అన్నా హజారే కోరినట్లుగా లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలి. అప్పుడే స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుంది. అవినీతిపై నిగ్గ తేలుస్తారు. రాజీకయ పార్టీలు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలకు చట్టాలు తేవాలి. ప్రస్తుత సమాజంలో బాగా వేళ్లూనుకున్న అవినీతి ఎక్కడయినా ఉందంటే అది రాజకీయ పార్టీల్లోనే. పటిష్ట లోక్‌పాల్ వ్యవస్థ ద్వారానే అవినీతి నేతలను శిక్షించగలం. అందుకు ప్రజా ఉద్యమాలు రావాలి. ఆప్ ఉద్యమంలా కాకుండా ప్రజలు, మేధావులు కలసి ఉద్యమించాలి. ఇక తెలుగు రాష్ట్రాల విషయాలకు వస్తే జగన్, వైకాపా అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కెసిఆర్, ఆయన కుటుంబం, బిఆర్‌ఎస్ నేతల అవినీతిపైనా చర్యలు ముందుకు సాగడం లేదు. తాజాగా కాంగ్రెస్ అవినీతి బట్టబయలు అయ్యింది. ఈ క్రమంలో వీరి అవినీతిపై చర్యలు ఉంటాయనుకోవడం కూడా అత్యాశే అవుతుంది. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. రెండేళ్లుగా సాలీడు దారంలా సాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా మాజీ మంత్రి హరీష్‌రావును సిట్ అధికారులు 7 గంటలపాటు విచారించారు. సిట్ విచారణపై ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదని, రాజకీయంగా కొట్లాడుదాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం సహా అనేక అవినీతి కేసులు ఉన్నా ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. వారి అవినీతిని ప్రశ్నిస్తున్న అధికార కాంగ్రెస్ నేతలు తామూ అవినీతి బురదలో కూరుకు పోయారు. ఒక్కో మంత్రి మీద ఒక్కో అవినీతి బయటపడుతోంది. దీనినిబట్ట అవినీతి రాజకీయ పార్టీల హక్కుగా మారిందని అర్థం చేసుకోవాలి. ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేసు, కాళేశ్వరం వంటివనీ పిచ్చకుంట్ల, లొట్టపీసు కేసులని బిఆర్‌ఎస్ వాదిస్తోంది. కాగ్రెస్ పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర లోనే ఉన్నాయని హరీష్ రావు వ్యాఖ్యానించడం, ఆయన తప్పించుకునే రాజకీయ తెలివిని ప్రదర్శించారని గుర్తించాలి. ఇకపోతే సింగరేణి సంస్థ నిబంధనలు మార్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బావమరిదికి రూ.1,600 కోట్ల టెండర్లు కట్టబెట్టారని బిఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. బొగ్గు కుంభకోణంపై నిగ్గు తేల్చడం కోసం సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ అనేక కుంభకోణాలకు పాల్పడిందని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు. మంత్రుల వద్ద వాటాల పంచాయితీ నడుస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో సింగరేణిపై ఏ ప్రభుత్వం కూడా అజమాయిషి చేయలేదని, కానీ, రేవంత్ సర్కార్ మాత్రం అజమాయిషీ చేస్తూ, తద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. మొత్తానికి వజ్రాన్ని వజ్రంతోనే కోయాలని అంటారు. అవినీతి ఆరోపణలను అవినీతి ఆరోపణలతో తిప్పికొట్టడం ఇప్పుడు రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. సింగరేణి సంస్థకు నష్టం చేకూరేలా చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినప్పుడు దానిని సరిదిద్దుకొని సంస్థ ఖజానాకు గండి పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీది. సింగరేణిపై కాంగరెస్, బిఆర్‌ఎస్ పార్టీలు గద్దల్లా పడి దోచుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. బొగ్గు మంత్రిగా ఉన్నా కిషన్ రెడ్డి ఏం చేస్తున్నట్లు అన్నది చెప్పాలి. కేంద్రం నిజాయితీగా ఎందుకు వ్యవహరించడం లేదు. అవినీతిపరులను ఎందుకు బోను ఎక్కించడం లేదు. ఇవన్నీ శేష ప్రశ్నలు. సాధారణ టెండర్లలోనూ బిడ్ వేసే ముందు కాంట్రాక్టర్లు పనిచేసే ప్రాంతాన్ని సందర్శించి టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలతో బేరీజు వేసుకుంటారు. ప్రీబిడ్ సమావేశంలో తమ అనుభవాలు, సమస్యలు, అభ్యంతరాలను అధికారుల ముందు ఉంచి పరిష్కారాలు, వెసులుబాట్లను ప్రతిపాదిస్తారు. కానీ సింగరేణి టెండర్లు మైనింగ్‌కు సంబంధించినవైనందున భౌగోళిక పరిస్థితులతో ముడిపడి ఉంటుంది. అవినీతి వ్యవహారాలు పునరావృతం కాకుండా ఉండాలంటే కచ్చితంగా టెండర్ నోటిఫికేషన్‌లోనే కొత్త షరతులు పెట్టాల్సి ఉంటుంది. ఒడిశా అంగూల్ జిల్లాలోని నైని కోల్‌బ్లాక్‌ను 2015లో దక్కించుకున్న సింగరేణి సంస్థ, 2200 ఎకరాల విస్తీర్ణంలోని ఆ బ్లాకులో 200 ఎకరాల విస్తీర్ణానికి బీఆర్‌ఎస్ హయాంలోనే టెండర్లు పూర్తి చేసి, పనులు అప్పగించింది. కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో ఐదేండ్ల పాటు బొగ్గు వెలికితీతకు పిలిచిన ఆ టెండర్లలో ఐదు సంస్థలు పోటీపడ్డాయి. చివరికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చెందిన వీపీఆర్ సంస్థ టెండర్ దక్కించుకున్నది. రోజుకు 30వేల క్యూబిక్ మీటర్ల ఓబీని ఈ సంస్థ వెలికి తీస్తున్నది. అతను కూడా రాజకీయ పార్టీకి చెందిన వాడే ఆవడంతో అవినీతికి ఆస్కారం ఏర్పడింది. టెండర్ విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలనుకుంటే సైట్‌ను పరిశీలించిన ప్రతి కంపెనీకి ఇప్పటికే సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉన్నది. ఆ మేరకు సుశీ కంపెనీతో పాటు పలు కంపెనీలు కూడా పదేపదే అధికారులకు ఫోన్ చేసి తమకు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతున్నా అధికారులు జారీ చేయలేదంటే.. ప్రభుత్వ పెద్దల ఆదేశాల కోసం వేచి చూస్తున్నారనేది బహిరంగ రహస్యం. అయితే నైనీ టెండర్లకు సంబంధించి అసలు ఈ సర్టిఫికెట్ ఎవరు జారీ చేయాలనే దానిపైనా సింగరేణిలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతుందంటే ప్రక్రియ ఎంత గుడ్డిగా కొనసాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంలో విచారణ జరగాలి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో వస్తున్న ఆరోపణలపై విచారణ జరగాలి. బిఆర్‌ఎస్ పదేళ్ల పాపాలపైనా విచారణ సాగాలి. చంద్రబాబు, జగన్ పాపాలపైనా విచారణ జరగాలి. అందుకు లోక్‌పాల్ ఒక్కటే శరణ్యం.

## కామారెడ్డి జిల్లాలో విషాదం..

**కోతుల గుంపుపై విష ప్రయోగం, పలు వానరాలు మృతి**



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కామారెడ్డిజిల్లా విషాదం చోటు చేసుకుంది. కోతులపై విషయ ప్రయోగం చేయడంతో పది కోతులు మృతి చెందాయి. మరికొన్ని కోతులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండా పశువైద్య సిబ్బంది కాపాడారు. ఈ విషాదాకర సంఘటన బిక్కనూరు మండలం అంతంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుర్తుతెలియని వ్యక్తులు కోతులను అంతంపల్లి సమీపంలోని ఓ హొటల్ వద్ద వదిలిపోయారు. కోతులు మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానిక సర్పంచ్ ఏనుగు మంజుల వెంటనే పోలీసులతో పాటు అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా ఎవరో వాహనంలో సుమారు 150 నుంచి 200 వరకు కోతులను తీసుకొచ్చి వదిలిపెట్టనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇటీవల కాలంలో దుండగులు మూగజీవాలకు విషం పెట్టి చంపి వేస్తున్న సంఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇది గ్రామస్తులకు, పశువులకు కూడా ప్రమాదకరమని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వాలు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# 5 వేల కోట్ల కోసం 42 ఎకరాల భూమి అమ్మకం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో మొత్తం 42 ఎకరాలను వేలం వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ద్వారా సుమారు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. దీనికి సంబంధించి హెచ్ఎండీఏ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అయితే గతంలో హైదరాబాద్‌లో జరిగిన భూముల వేలాల్లో రికార్డు ధరలు పలికాయి. దీంతో ఈసారి కూడా భారీ స్పందన వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి సిద్ధమవుతోంది. మొత్తం 42 ఎకరాల భూమి వేలం వేయాలని నిర్ణయించింది. దీని ద్వారా దాదాపు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. కాగా, భాగ్యనగరంలో భూములు వేలం వేసిన ప్రతిసారి రికార్డు ధరలు పలుకుతున్నాయి. ఇటీవల కోకాపేటలో ఎకరం రూ. 151 కోట్లు పలికింది. అంతకుముందు రాయదుర్గంలో జరిగిన వేలంలో ఎకరం ఏకంగా రూ. 177 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. ఈ తరుణంలో త్వరలో జరగబోయే వేలంలో ఎకరం ఎంత పలుకుతుంది అనేది ఆసక్తిగా మారింది.మూసాపేటలో 14 ఎకరాలు, బంజారాహిల్స్‌లో 8.37 ఎకరాలు, కొండాపూర్‌లో 20 ఎకరాల వేలం వేయడానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కసరత్తు చేస్తోంది. దాదాపు రెండు నెలల క్రితం కోకాపేటలో భూములు వేలం వేసినప్పుడే.. మూసాపేటలో భూములను కూడా విక్రయించాలనిలని ప్రభుత్వం భావించింది. అయితే భూములు వేలం వేయొద్దంటూ స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి వ్యతిరేకత రావడం వల్ల.. ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కాగా, ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో మరోసారి ఈ భూముల వేలం మరోసారి తెరపైకి వచ్చింది. ఆ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం.. స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపి భూములను వేలం వేసేందుకు ఆమోదం తెలిపింది.బంజారా హిల్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు 15 ఎకరాల వరకు ఉన్న భూమి.. చాలా వరకు కబ్జాకు గురైంది. ప్రభుత్వ స్థలంలోకి నిర్మాణాలు చొచ్చుకొచ్చాయి.

దీంతో కొండ ప్రాంతాన్ని పక్కకు పెట్టి.. 8.37 ఎకరాలను విక్రయించాలని ప్రభుత్వం భావించింది. కొండాపూర్‌లో 20 ఎకరాలు, మూసాపేటలోని 14 ఎకరాలు కలిపి మొత్తం 42 ఎకరాలను ఆన్‌లైన్‌లో వేలం వేసేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది.మరోవైపు, హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతోంది. భారత్‌లోని టాప్ నగరాలతో పోటీ పడుతూ అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా గుర్తింపు పొందుతోంది. మౌలిక సదుపాయాలు, మానవవనరులు పుష్కలంగా ఉండటంతో.. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ప్రారంభించడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారీ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టాలనుకునే సంస్థలకు భూములు దొరకడం కష్టంగా మారింది. ప్రైవేటు స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నా.. విక్రయించడానికి యజమానులు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో గతంలో టీజీఐఐసీ, హెచ్ఎండీఏలు వేలం వేసిన భూములకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో కూడా అలాంటి రెస్పాన్స్ వచ్చి.. రూ. 5 వేల కోట్ల టార్గెట్ చేరుకుంటామని ప్రభుత్వం భావిస్తోంది.

# సంపన్నుల సంపద భయం!

**తమ పై పన్నులేయాలంటూ బహిరంగ లేఖ**

**కార్పొరేట్ల నుండి దావోస్‌లో సంతకాల సేకరణ**

**వెబ్‌సైట్ పెట్టి ప్రచారం**

'సంపద ఒక వైపు కేంద్రీకృతమయ్యే కొద్దీ మరోవైపు పేదరికం, అభద్రత, పేదరికం పెరుగుతాయి. ఈ ప్రక్రియ కార్మిక వర్గంలో అశాంతి, ఆగ్రహం, విప్లవ చైతన్యాన్ని పెంచుతుంది' కొన్ని వందల సంవత్సరాల క్రితం కారల్ మార్క్స్ చెప్పిన మాట ఇది! సరళీకరణ ఆర్థిక విధానల ఫలితంగా మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ప్రస్తుతం పెరుగుతున్న అంతరాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.శతకోటీశ్వరుల సంపద అనూహ్యంగా పెరుగు తుండగా, సామాన్యుల రోజువారీ జీవనం కూడా కష్టమవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. ఈ పరిస్థితి సంపన్నుల్లో సైతం ఆందోళనకు దారి తీస్తోందా? కార్మికవర్గం జీవన భద్రతను కూడా కోల్పోతే తిరుగుబాటు అనివార్యమన్న మార్క్స్ చెప్పిన మాట వారిని భయపెడు తోందా? దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన కొందరు శతకోటీశ్వర్లు తమపై తక్షణమే సంపద పన్ను విధించాలం టూ వివిధ దేశాల ప్రభుత్వాలను కోరుతూ విడుదల చేసిన బహిరంగ లేఖ ఇటువంటి అనుమానాలనే కలిగిస్తోంది. 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 400 మంది సంపన్నులు ఆ లేఖపై సంతకాలు చేశారు. అంతటితో ఆగకుండా 'టైమ్ టు విన్ ' పేరిట ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న శతకోటీశ్వరు లను సంతకాలు చేయాలని కోరుతున్నారు. సంపద పన్నును విధించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోని విషయం తెలిసిందే. తాజాగా విడుదలైన లేఖపై సైతం మన దేశానికి చెందిన శత కోటీశ్వరులు ఎవ్వరూ సంతకాలు చేయకపోవడం గమనార్హం.




లేఖలో ఏముంది?: 'దావోస్‌కు హాజరైన మిత్రులారా×మనందరికీ ఇది గెలిచే సమయం' అన్న పేరుతో ఈ లేఖ విడులైంది. 'అత్యంత ధనికులు, మిగిలిన వారి మధ్య అంతరం రోజురోజుకి పెరుగుతోంది. పొరుగనే ఉన్న కాలనీల నుండి దేశాల వరకు ఈ చీలిక విస్తరించిం ది. ప్రపంచంలోని అత్యంత ధనికులపై ఒక్కశాతం మంది 95 శాతం మంది జనాభ వద్ద ఉన్న సంపద కన్నా ఎక్కువ పోగేసుకున్నారు. ఈ కొద్దిమంది ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వాలను ఆధీనంలోకి తీసుకున్నారు. మీడియా గొంతు నొక్కారు. సాంకేతికత, ఆవిష్కరణలపై పట్టు సాధించారు. పేదరికం, సామాజిక వెలివేతను మరింతగా పెంచుతున్నారు. మా లాంటి కొద్ది మంది వద్ద పోగుపడుతున్న సంపద సమాజాన్ని ప్రమాదపు అంచున నిలిపిందన్న దానిలో సందేహమే లేదు. అధిక సంపద కొద్ది మందికి అతి నియంత్రణకు అవకాశం ఇచ్చింది. అది మన భద్రమైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతొంది. ఇప్పుడు ఆ నియంత్రణకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చేసింది. అత్యంత ధనికులపైన అంటే మాపైన పన్ను వేయండి. ఇది ప్రజాస్వామ్యాన్ని తిరిగి పొందడానికి దోహద పడుతుంది.' అని లేఖలో వారు పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు

## 42 ఎకరాల భూమి

**విజయవాడ,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన కొండాపూర్ ప్రాంతంలో గల 42 ఎకరాల భూమి ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది. సుమారు 4,000 కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిపై తమకే అధికారం ఉందంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. కర్నూలు కేంద్రంగా పనిచేసే బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ కు చెందిన ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేయడం సంచలనంగా మారింది.ఈ వివాదానికి మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే ఉన్నాయి. కర్నూలు జిల్లా కేంద్రంగా బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ రిజిస్టర్ అయింది. ఈ ట్రస్ట్‌కు కొండాపూర్‌లోని సర్వే నంబర్లు 105 నుంచి 108 వరకు సుమారు 42.03 ఎకరాల భూమి ఉంది. 2005లో అప్పటి ప్రభుత్వం జీఓ 2065 ద్వారా ఈ యూఎల్‌సీ మిగులు భూములను ట్రస్ట్‌కు క్రమబద్ధీకరించింది. బాలసాయిబాబా మరణం తర్వాత ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలను ఏపీ దేవాదాయ శాఖ చేపట్టింది. కర్నూలు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారిని ఈ ట్రస్ట్‌కు అధికారిగా నియమించారు.ఈ వివాదంలో ప్రైవేటు సంస్థ అయిన భూపతి ఎస్టేట్స్ ప్రవేశించడంతో సమస్య సంక్లిష్టంగా మారింది. 2023లో తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికార్డులలో మార్పులు చేస్తూ, ట్రస్ట్ పేరుకు బదులుగా 'భూపతి ఎస్టేట్స్' పేరును చేర్చింది. బాలసాయి బాబా ట్రస్ట్ భూములను ఈ ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తమకు సమాచారం ఇవ్వకుండా, ఏపీ పరిధిలో ఉన్న ట్రస్ట్ భూములను తెలంగాణ ప్రభుత్వం ఎలా బదలాయిస్తుందని ఏపీ దేవాదాయ శాఖ ప్రశ్నిస్తోంది. ఈ క్రమబద్ధీకరణ చెల్లదని, తెలంగాణ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది.తమ్మనబోయిన సంతోష్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్ పై విచారణ సందర్భంగా ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ కీలకమైన కౌంటర్ దాఖలు చేశారు. ఈ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ చట్టం కింద ఏపీలో రిజిస్టర్ అయింది. కాబట్టి దాని ఆస్తుల నిర్వహణ ఏపీ దేవాదాయ శాఖ పరిధిలోకే వస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత ఆయా రాష్ట్రాల్లోని భూములు ఆ రాష్ట్రాలకే చెందుతాయన్న నియమం ఉన్నప్పటికీ, ఒక రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని ట్రస్ట్ ఆస్తులను మరో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడుతుందని ఏపీ ప్రశ్నిస్తోంది. ఈ భూములపై తెలంగాణకు ఎలాంటి పరిపాలనాపరమైన అధికారం లేదని ఏపీ తేల్చి చెప్పింది.తెలంగాణ ప్రభుత్వం ఈ భూములు తమ భౌగోళిక పరిధిలో ఉన్నాయని, స్థానిక రెవెన్యూ నిబంధనల ప్రకారమే మార్పులు జరిగాయని భావిస్తోంది. అయితే, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌పై తెలంగాణ ప్రభుత్వం తన తదుపరి వాదనలను కోర్టులో వినిపించాల్సి ఉంది. గతంలో కొందరు పిటిషన్లు వేసి ఉపసంహరించుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తుండటంతో, ఈ వ్యవహారం మరింత ముదిరేలా కనిపిస్తోంది.4,000 కోట్ల విలువైన భూమి కావడం, ఇందులో ఒక ఆధ్యాత్మిక ట్రస్ట్, ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు భాగస్వామ్యం కావడంతో ఈ కేసు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపుతోంది. హైకోర్టు ఇచ్చే తీర్పు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల పంపకాల వివాదాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఏపీలో కొత్త పార్టీలు

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీలో కొత్త పార్టీలు రానున్నాయా? ఆ స్పేస్ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏపీలో ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. జాతీయ పార్టీల ప్రభావం అంతంత మాత్రమే. అధికార టిడిపి, జనసేనలు ప్రాంతీయ పార్టీలు. వాటితో అధికారం పంచుకున్న బిజెపి జాతీయ పార్టీ. మరో ప్రతిపక్ష పార్టీగా వైసీపీ ఉంది. అది సైతం ప్రాంతీయ పార్టీ. ఇంకా చిన్నచితకా పార్టీలు ఉండనే ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఏర్పాటు అంశం అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా ఏబీ వెంకటేశ్వరరావు, విజయసాయిరెడ్డి, షర్మిలాలు కొత్త పార్టీలు పెడతారని ప్రచారం నడుస్తోంది. అయితే ఈ ముగ్గురు పార్టీలు పెడితే ఎవరికి నష్టం అంటే మాత్రం..

కచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి. అయితే ఆ ముగ్గురు టార్గెట్ సైతం జగన్మోహన్ రెడ్డి పార్టీ అని తెలుస్తోంది. వారి పార్టీల ఏర్పాటు వెనుక కూడా ఒక రకమైన వ్యూహం ఉన్నట్లు సమాచారం. అయితే వారి పార్టీ ప్రకటన నేరుగా లేదు కానీ ప్రచారం మాత్రం జరుగుతోంది.ఏబీ వెంకటేశ్వరరావుజగన్మోహన్ రెడ్డి సర్కార్ బాధిత అధికారి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి సర్కార్లు ఆయన ఇంటలిజెన్స్ అధికారిగా పనిచేశారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు చాలామంది టీడీపీలో చేరారు. ఆ సమయంలో నిఘా అధిపతిగా ఉన్న ఆయన టిడిపికి అనుకూలంగా పనిచేశారన్న అనుమానం జగన్ లో ఉండేది. అందుకే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితుడిగా మారారు ఏబీ వెంకటేశ్వరరావు. ఈ రాష్ట్రానికి డిజిపి కావాల్సిన అధికారి లూప్ హోల్స్ లో ఉండిపోయారు. ప్రమోషన్ పొందిన నాడే పదవీ విరమణ చేశారు. అయితే ఇంతటి మూల్యాన్ని చెల్లించుకున్న తనకు తెలుగుదేశం అధికారంలోకి వస్తే మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. అయితే తన ఆలోచనకు తగ్గట్టు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు, పదవి దక్కలేదు. పైగా తాను ఆశించినట్టు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ట్రీట్మెంట్ ఇవ్వడం లేదన్న ఆవేదన ఉంది. మరోవైపు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సైతం తనకు ఇబ్బందులు ఉన్నాయి. అందుకే ఆయన కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ఇటీవల ప్రకటించారు.మరోవైపు విజయసాయిరెడ్డికొత్త పార్టీ పెడతారన్న ప్రచారం నడుస్తోంది. ఏడాది కిందట ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యత్వంతో పార్టీకి కూడా రాజీనామా చేశారు. ఇకనుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు.. అయితే ఆయన రూటు మార్చినట్టు కనిపిస్తున్నారు. ఇటీవల నిత్యం జగన్ కోటరిని టార్గెట్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించే వీలుగా ఒక కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వెనుక తెలుగుదేశం హస్తం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి రెడ్డి సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి దక్కకుండా విజయసాయిరెడ్డి తో పార్టీని ఏర్పాటు చేయిస్తున్నారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది.వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా టాక్ నడుస్తోంది. తెలంగాణలో తన తండ్రి పేరిట పార్టీ ఏర్పాటు చేసిన షర్మిల అక్కడ నడపలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు అందుకున్నారు. సోదరుడు జగన్తో వచ్చిన విభేదాలతో ఆయనను అధికారం నుంచి దూరం చేయాలని చూసారు.

ఆ విషయంలో సక్సెస్ అయిన ఏపీలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కాలేదు. అందుకే కాంగ్రెస్ అధినాయకత్వం షర్మిలను తప్పిస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఈ తరుణంలో ఆమె ప్రత్యేక రాయలసీమ సాధన కోసం ఒక పార్టీని ఏర్పాటు చేస్తారని టాక్ నడుస్తోంది. ఇటీవల రాజకీయంగా యాక్టివిటీస్ తగ్గించారు షర్మిల.

అందుకే ఈ ప్రచారం మరింతగా సాగుతోంది. అయితే వీరు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారు అనేది ఒక్క ప్రచారం మాత్రమే. వారు పార్టీలు ఏర్పాటు చేస్తే మాత్రం అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించే విషయమే.

# కార్యకర్తలు సరే... లీడర్లు ఏరీ

**కడప,తెలంగాణ దిశ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్ని లక్ష్యంగా చేసుకుని తన వ్యూహాలను పునర్వ్యవస్థీకరించుకునే ప్రయత్నంలో ఉంది. ప్రధానంగా ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం అన్నదే పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఈ లక్ష్యాలు కార్యరూపం దాల్చడంలో మాత్రం స్పష్టత కొరవడినట్టు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పార్టీ నిర్ణయించినప్పటికీ, ఆ ఉద్యమాలు పరిమిత స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఎక్కువగా కార్యకర్తలు, స్థానిక నాయకులకే ఈ బాధ్యతలు అప్పగించడంతో ప్రజల్లోకి బలమైన సంకేతం వెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపు గత ఇరవై నెలలుగా




పార్టీ చేపట్టిన పలు కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం గమనార్హం. అంతేకాదు, ఆయనకు సన్నిహితుడిగా భావించే సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు.ఈ పరిస్థితుల్లో పార్టీ పోరాటాలు కేవలం కార్యకర్తల స్థాయికే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల మధ్యకు వస్తానని జగన్మోహన్ రెడ్డి గతంలో రెండు సార్లు తేదీలు ఇచ్చారన్న ప్రచారంజరిగింది. గత ఏడాది జూలై నెలలో ప్రజల్ని కలుస్తానని చెప్పినా, అది కేవలం కొద్ది సమయం పర్యటనకే పరిమితమైంది. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి విస్తృతంగా ప్రజల్లోకి వస్తానన్న మాట కూడా వాయిదా పడింది. తాజాగా పార్టీ వర్గాల్లో పాదయాత్రే తుది నిర్ణయం అన్న చర్చ నడుస్తోంది.అయితే ఈ పాదయాత్ర ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు. పార్టీ నాయకుల మాటల్లో చెప్పాలంటే 2027 లేదా 2028 వరకూ దీనికి ముహూర్తం ఉండకపోవచ్చని అంటున్నారు. ఇప్పుడే పాదయాత్ర చేపట్టినా ఎన్నికలకు ఇంకా సమయం ఎక్కువగా ఉండటంతో దాని ప్రభావం తగ్గిపోతుందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నారని సమాచారం. అందుకే ఎన్నికలకు ఒకటి లేదా రెండు సంవత్సరాల ముందు మాత్రమే పాదయాత్ర ప్రారంభించే యోచనలో ఉన్నారని చెబుతున్నారు .ఇదిలా ఉండగా, మధ్యలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు , కార్పొరేషన్ ఎన్నికలు పార్టీకి కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎలా ముందుకు సాగుతుంది, ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. పైగా జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కూడా చర్చ సాగుతోంది. ఆయన మోకాళ్ల సమస్యతో పాటు నడుము నొప్పితో బాధపడుతున్నారని ప్రచారం ఉంది. బహిరంగంగా చెప్పకపోయినా, గత కొన్నేళ్లుగా ఆయన వ్యవహార శైలిని గమనిస్తే ఆరోగ్య ఇబ్బందులు ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది


# పశువులకు డైపర్లు!

## పాక్‌లో విచిత్ర ఘటనలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో పేడ పన్ను దెబ్బకు విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. బయో గ్యాస్ కార్యక్రమం కోసం 'సుత్రా పంజా బ్' పేరుతో పంజాబ్ సీఎం మర్యం నవాజ్ ప్రతి బర్రెకు దాని యజమాని రోజుకు రూ.30 పన్నుగా చెల్లించాలని ఆదేశించారు.

పాకిస్థానీలు దీన్ని పేడ పన్నుగా పిలుస్తున్నారు. 168 పశు వుల కాలనీల్లోని 50 లక్షల జీవాలపై ఈ పన్ను పడనుంది.పన్ను ద్వారా రూ.450 కోట్లను సమీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీంతో కొందరు యజమానులు బర్రెలకు జీరో-వేస్ట్ ఆహారాన్ని అందిస్తున్నారు. మరికొందరు తమ పశువులకు డైపర్లు తొడగడం ప్రారంభించారు. 'పశు వుల పేడపై పన్ను వేసినప్పుడు.. మనుషుల మలం పైనా పన్ను వేయకుండా ఉండరు' అనే మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వెడ్డింగ్ హబ్ గా తిరుపతి



**తిరుపతి,తెలంగాణ దిశ :** కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులు భావించే వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల లో వివాహం చేసుకోవడం అత్యంత పవిత్రమని చాలామంది విశ్వసిస్తారు. ఆ పవిత్ర వాతావరణంలో కొత్త జీవితం ప్రారంభిస్తే దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఆరోగ్యంగా సాగుతుందని భక్తుల నమ్మకం. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం వివాహ జీవితానికి శుభకారకమని భావిస్తారు. ఏడుకొండల వాడి సన్నిధిలో జరిగే పెళ్లిని ఎంతో పవిత్రంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గౌరవిస్తారు.ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తిరుమల?తిరుపతి ప్రాంతాన్ని వివాహాల కోసం ప్రత్యేక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామం నారావారిపల్లె కు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే దిశగా అధికారులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి ఆదేశాలతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పర్యాటక శాఖ కలిసి ప్రత్యేక ప్యాకేజీపై కసరత్తు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం తిరుమలలో ఏటా సుమారు పదిహేను వేల నుంచి ఇరవై వేల వరకు వివాహాలు జరుగుతున్నాయి. శుభ ముహూర్తాలు ఉన్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తిరుపతి , తిరుచానూరు ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లు వీటికి అదనమే.ఇప్పటికే టీటీడీ వివాహాలు చేసుకునే జంటలకు కొన్ని సౌకర్యాలు అందిస్తోంది.

'కళ్యాణ వేదిక' లో వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక దర్శన అవకాశం, ఆశీర్వచన కార్యక్రమం, ప్రసాదాల పంపిణీ వంటి సదుపాయాలు ఉన్నాయి. అయితే ఈ వేదికలో ఆర్భాటాలకు అవకాశం తక్కువగా ఉండటంతో, కొందరు భక్తులు కొండపై ఉన్న ప్రైవేటు మఠాలు, సత్రాలు లేదా దిగువ ప్రాంతాల్లోని కళ్యాణ మండపాలను ఎంచుకుంటున్నారు. తొండవాడ , శ్రీనివాసమంగాపురం వంటి ప్రాంతాలు కూడా పెళ్లిళ్లకు ప్రాధాన్యం పొందుతున్నాయి. అయితే ఈ విధంగా ఇతర చోట్ల వివాహాలు చేసుకునే వారికి ఇప్పటివరకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు లేకపోవడం వల్ల భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ అంశం ప్రభుత్వ దృష్టికి రావడంతో, ఇకపై కళ్యాణ వేదిక వెలుపల పెళ్లి చేసుకున్నా కూడా శ్రీవారి దర్శనం, ఆశీర్వచనం, ప్రసాదాలు అందించే విధంగా కొత్త విధానం తీసుకురావాలని యోచిస్తోంది.వివాహ వేదిక అలంకరణ, భోజన ఏర్పాట్లు, రవాణా, వసతి వంటి సేవలను ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్లకు అప్పగించి, ప్రభుత్వ పర్యవేక్షణలో ప్యాకేజీగా అందించా లని ప్రతిపాదనలు రూపొం దిస్తున్నారు. దీని వల్ల పెళ్లి చేసుకునే వారికి సౌలభ్యం కలగడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలుపితే, తిరుమల?తిరుపతి ప్రాంతం ఆధ్యాత్మికతతో పాటు వివాహాల కోసం కూడా దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# మరో ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ

**మహబూబ్ నగర్ ,తెలంగాణ దిశ :** కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకానికి త్వరలోనే పర్యావరణ అనుమతులు లభించే అవకాశం ఉంది. రూ.4,885 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వికారాబాద్, నారాయణపేట జిల్లాలోని పలు మండలాలకు సాగు నీరు అందించనున్నారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నిర్మించ తలపెట్టిన కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే ఈ పథకానికి పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశం ఉంది. దీనికోసం రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు మండలి హైదరాబాద్‌లో సోమవారం సమావేశమైంది. గతంలో జరిగిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలను పరిశీలించి, ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే.. వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధిలోని కోస్గి, నారాయణపేట, దౌల్తాబాద్,బొంరాస్‌పేట, కొడంగల్, ధన్వాడ, ఊట్కూరు, మక్తల్, మద్దూర్, దామరగిద్ద మండలాల్లోని భూములకు సాగు నీరందుతుంది. భూసేకరణలో భాగంగా ఎకరాకు గరిష్ఠంగా రూ. 20 లక్షల పరిహారం చెల్లించనున్నట్లు ఇంజినీర్లు రాఇఎంకు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 4,425 చెట్లను తొలగించాల్సి ఉంది. అలా తొలగించిన చెట్ల స్థానంలో కాలువలు, చెరువుకట్టలపై పదింతల చెట్లను పెంచుతామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ ఎత్తిపోతల పథకం కోసం రూ. 4,885 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీ మొత్తంతో నిర్మిస్తున్న ఈ పథకంలో 209 మెగావాట్ల సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పంపుహౌస్‌లు, ప్రెజర్ మెయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు అప్పగించింది. పర్యావరణ అనుమతులు మంజూరై, భూసేకరణ పూర్తయితే.. ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతాయి.డిసెంబర్ 8న కాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల శాఖలు ఈ ప్రాజెక్టు పరిధిలోని రెండు ప్రాంతాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించాయి.ఆ నివేదికల ఆధారంగానే రాఇఎం సమావేశం జరిగింది. ఇంజినీర్ల అంచనా ప్రకారం, కొద్దిరోజుల్లోనే పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశాలున్నాయి. ఆ వెంటనే భూసేకరణ జరిపి.. పనులు వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# 3 జిల్లాలో 6 అర్బన్ ఫారెస్టులు



హైదరాబాద్,,తెలంగాణ దిశ : తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 'నగర్ వన్ యోజన' కింద రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో 6 అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటి అభివృద్ధికి రూ. 8.26 కోట్లు మంజూరు చేసింది. పట్టణాల్లో పచ్చదనం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. కాగా, పట్టణాల్లో ఏర్పాటు చేయబోయే ఈ వనాలల్లో స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలంగాణ అటవీ శాఖ అధికారులు తెలిపారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణలోని మూడు జిల్లాల్లో 6 అర్బన్ ఫారెస్ట్‌లు అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు 'నగర్ వన్ యోజన' కింద రాష్ట్రానికి రూ. 8.26 కోట్లు మంజూరు చేసింది. అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. అందులో భాగంగా తొలివిడతలో 70 శాతం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ అటవీ శాఖ అధికారులు వివరాలు వెల్లడించారు.పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం.. నగర్ వన్ యోజన పథకాన్ని 2020 జూన్ 5న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. పట్టణాల పరిధిలో అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు ద్వారా.. పర్యావరణ సమతుల్యత కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలకు ఆరోగ్యకర మైన జీవన వాతావరణాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, మొదటి ఐదేళ్లలో 200 పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఇప్పుడు 1000 నగరాల్లో వీటిని అభివృద్ధి చేయాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా తాజాగా తెలంగాణలో 6 అర్బన్ ఫారెస్టులకు ఆమోదం తెలిపింది.మరోవైపు, పట్టణాల్లో నగర్ వన్ యోజన కింద ఏర్పాటయ్యే అర్బన్ ఫారెస్ట్‌లల్లో.. స్థానిక వృక్ష జాతికి చెందిన మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఇవి అర్బన్ ప్రజలకు ప్రకృతిలో గడిపిన అనుభూతిని అందిస్తాయని చెప్పారు. ఈ పట్టణ వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు, విశ్రాంతి కేంద్రాలు, పచ్చని మైదానాలు ఏర్పాటు చేయనున్నారు.ఆదిలాబాద్, మంచిర్యాల, మేడ్చల్- మల్కాజ్‌గిర్ జిల్లాలో ఈ 6 అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మావలా, యాపల్‌గూడ?ఎఎ పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులు ఏర్పాటు కానున్నాయి. ఇక మంచిర్యాల జిల్లాలో ఇందారం (క్యాతనపల్లి మండలం), చెన్నూర్‌లలో ఏర్పాటు చేస్తారు. మేడ్చల్ ?మల్కాజ్‌గిరి జిల్లాలో యెల్లంపేట, చెంగిచెర్లలో పట్టణ వనాలు అభివృద్ధి చేయనున్నారు.మరోవైపు, తెలంగాణలో 9 జిల్లాల్లోని మున్సిపాలిటీల పరిధిలో.. 14 అర్బన్ ఫారెస్టులను ఏర్పాటు చేయనున్నట్లు 2025 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో పార్కుకు రూ. 2 కోట్ల చొప్పున.. రూ. 28 కోట్లను కేటాయించింది. తాజాగా మూడు జిల్లాలో ఆరు పట్టణ వనాలకు నిధులు విడుదల చేసింది. మిగతా వికారాబాద్ (4), భూపాలపల్లి (1),కొత్తగూడెం (1), జగిత్యాల (1), పెద్దపల్లి (1) జిల్లాలోని పట్టణ వనాలకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

# బొంద రాజకీయాలు..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం "బొంద పెట్టాలి" అనే పదం చుట్టూ పెద్ద దుమారమే రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి బీఆర్ఎస్ ఇస్తున్న కౌంటర్లు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్ అయ్యాయి. ఖమ్మం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఒకప్పుడు తాను పెరిగిన తెలుగుదేశం పార్టీని తెలంగాణలో నామరూపాలు లేకుండా చేసిన కేసీఆర్‌పై రేవంత్ తన కసిని వెళ్లగక్కారు. అయితే, దీనికి బీఆర్ఎస్ ఇస్తున్న రిటార్ట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినప్పటికీ, ఆయన రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచే మొదలైంది. తెలంగాణలో నేడు టీడీపీకి బలమైన నాయకత్వం లేకపోయినా, క్షేత్రస్థాయిలో ఆ పార్టీ సానుభూతిపరులు, కేడర్ ఇంకా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉండటంతో,ఆ ఓటు బ్యాంకులో మెజారిటీ కాంగ్రెస్‌కు మళ్లినట్లు విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలో చంద్రబాబుకు వ్యతిరేకంగా కేసీఆర్, జగన్ చేతులు కలిపారనే భావన టీడీపీ అభిమానుల్లో బలంగా ఉంది. దీనిని క్యాష్ చేసుకునేందుకే రేవంత్ రెడ్డి "టీడీపీని దెబ్బతీసిన కేసీఆర్‌ను, ఆయన బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలి" అంటూ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు.రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేతలు తీవ్రంగా స్పందిస్తూ ఒక చారిత్రక కోణాన్ని ముందుకు తెచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే కాంగ్రెస్ వ్యతిరేక భావజాలంపైన..! ఎన్టీఆర్ తన జీవితాంతం కాంగ్రెస్ అరాచక పాలనపైనే పోరాడారు. "ఎన్టీఆర్ ఆత్మ శాంతించాలంటే ఆయన బద్ధశత్రువైన కాంగ్రెస్‌నే బొంద పెట్టాలి కానీ, ఆయన శిష్యుడైన కేసీఆర్‌ను కాదు" అనేది బీఆర్ఎస్ వాదన. రేవంత్ రెడ్డి ఇప్పటికీ టీడీపీ ఏజెంట్‌గా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్లు ఈ వ్యవహారంపై సెటైర్ల వర్షం కురిపిస్తున్నారు. ఒకవైపు రేవంత్ ఏమో బీఆర్ఎస్ ను బొంద పెట్టాలంటున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఏమో కాంగ్రెస్ ను బొంద పెట్టాలంటోంది. మరికొందరు నెటిజన్లు "అసలు ఒకప్పుడు టీడీపీలో కలిసి పనిచేసిన రేవంత్, కేసీఆర్.. ఇప్పుడు ఒకరినొకరు బొంద పెట్టుకుంటామనడం విడ్డూరంగా ఉంది" అని కామెంట్ చేస్తున్నారు.తెలంగాణలో టీడీపీ ఉనికి కోల్పోవడానికి కేసీఆర్ ఆపరేషన్ ఆకర్ష్ ప్రధాన కారణం అనడంలో సందేహం లేదు. ఓటుకు నోటు కేసు తర్వాత చంద్రబాబు ఏపీకి పరిమితం కావడం, ఇక్కడి నేతలంతా బీఆర్ఎస్ లో చేరిపోవడం చకచకా జరిగిపోయాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి పిలుపుతో పాత టీడీపీ శ్రేణులు ఆలోచనలో పడ్డాయి. అయితే, రేవంత్ కాంగ్రెస్ లో ఉండి టీడీపీ గురించి మాట్లాడటాన్ని కొంతమంది కాంగ్రెస్ విధేయులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు.తెలంగాణలో ఇప్పుడు పాత కక్షలు, పార్టీల మనుగడ చుట్టూ తిరుగుతోంది. రేవంత్ రెడ్డి తన 'టీడీపీ మూలాలను' వాడుకొని బీఆర్ఎస్ ను దెబ్బతీయాలని చూస్తుంటే, బీఆర్ఎస్ అదే 'ఎన్టీఆర్ సెంటిమెంట్'తో రేవంత్ ను ఇరకాటంలో పెట్టాలని చూస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ 'బొంద' రాజకీయం ఎవరికి లాభిస్తుందో చూడాలి.

# అమ్రాబాద్‌లో కొత్త అడ్వెంచర్

మహబూబ్ నగర్,తెలంగాణ దిశ : వన్యప్రాణి, ప్రకృతి ప్రేమికులకు తెలంగాణ అటవీ శాఖ తీపి కబురు అందించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో త్వరలోనే 20 కిలోమీటర్ల సరికొత్త 'కొల్లాం' సఫారీ మార్గాన్ని ప్రారంభించనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు. ఇందుకోసం రహదారి పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ప్రస్తుతం అమ్రాబాద్‌లో మూడు రకాల సఫారీలు అందుబాటులో ఉన్నాయి. ఫరాహాబాద్ సఫారీ మె?త్తం 16 కి.మీ. ప్రయాణం కాగా... 7 సీట్ల వాహనానికి రూ. 3 వేలు ఛార్జ్ చేస్తున్నారు. గుండం సఫారీ దట్టమైన అడవిలో 35 కి.మీ. ప్రయాణం కాగా..వాహనానికి రూ. 5 వేలు, అక్కమహాదేవి గుహల సఫారీ 14 కి.మీ ప్రకృతి అందాల మధ్య ప్రయాణానికి.. 5 సీట్ల వాహనానికి రూ. 3 వేలు వసూలు చేస్తున్నారు.ఈ సఫారీ కార్యకలాపాలన్నీ కూడా స్థానిక చెంచు గిరిజనులే నిర్వహిస్తున్నారు. మొత్తం 18 సఫారీ వాహనాలకు వారే డ్రైవర్లుగా, నేచర్ గైడ్‌లుగా వ్యవహరిస్తూ పర్యాటకులకు అడవి గురించి వివరిస్తారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని నేరుగా 'టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్'కు, గిరిజనుల జీవనోపాధికి మళ్లిస్తున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా టైగర్ రిజర్వ్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఫరాహాబాద్ వ్యూ పాయింట్, గుండం, దోమల పెంట వంటి ప్రాంతాల్లో బయో-టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు పర్యాటకులు రాకపోకలు సాగించే చోట స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించారు. వన్యప్రాణుల కోసం అడవి లోపల సోలార్ బోర్ వెల్స్, నీటి కుంటలను నిర్వహిస్తున్నారు. 2025 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు దాదాపు 50 సార్లు పులులు పర్యాటకులకు కనిపించడం ఇక్కడి అడవి ఆరోగ్యాన్ని సూచిస్తోంది.దేశ వ్యాప్తంగా జరుగుతున్న 'ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026' (పులుల గణన) కారణంగా జనవరి 20 నుంచి 25 వరకు అమ్రాబాద్‌లో సఫారీ కార్యకలాపాలను నిలిపివేశారు. ఈ పులుల గణన కార్యక్రమంలో మె?త్తం 139 మంది అటవీ సిబ్బందితో పాటు 170 మంది వాలంటీర్లు పాల్గొంటున్నారు.

# సమగ్ర శాసనం కోసం



రాష్ట్రంలో 1930వ దశాబ్దం ప్రారంభం నుండి పారిశ్రామికాభివృద్ధి క్రమంగా వేగం పుంజుకుంది. పరిశ్రమల సంఖ్యతో పాటే కార్మికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అయితే, దీనికి తగ్గట్టుగా కార్మికుల రక్షణకు సమగ్రచట్టాలు లేవు. ఫ్యాక్టరీ యాక్టు వంటి ఒకటి, రెండు చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలైన దాఖలాలు రాష్ట్రంలో ఎక్కడా లేవు. వేతనాల నుండి పని ప్రదేశాల్లో భద్రత వరకు ఒక్క అంశం కూడా అమలులోకి రాకపోవడంతో కార్మికుల పరిస్థితి ఘోరంగా మారింది. దీంతో కార్మికులను సంఘటితం చేసి,వారి హక్కుల పరిరక్షణ కోసం సమగ్ర శాసనం రూపొందించాలన్న డిమాండ్ ప్రారంభమైంది. సహజంగానే కమ్యూనిస్టు పార్టీ ఈ కృషిని భుజాన వేసుకుంది. కార్మికుల్లో విస్తృతంగా ప్రచారాన్ని ప్రారంభించింది. కార్మికులకు భద్రత, కనీస సౌకర్యాలు, హక్కులు, ఉద్యోగ భద్రత, పనిగంటలు, కార్మిక సంఘాలు ఏర్పాటుచేసుకునే హక్కు తదితర అంశాలను ఈ శాసనం చేర్చాలంటూ కమ్యూనిస్టులు చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. దీంతో 1937లో మద్రాసు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మంత్రివర్గం కార్మిక సమస్యలపై తన ఆలోచనలను తెలియచేస్తూ ఒక ప్రకటన చేసింది. కార్మిక వివాదాల్లో ఇరు పక్షాల మధ్య రాజీ కుదర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దీనిలో పేర్కొన్నారు. అదే సమయంలో కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియచేయాలని, సంప్రదింపులకు అవకాశం ఇవ్వాలని, తక్షణమే ప్రత్యక్ష ఆందోళనలకు దిగకూడదని కూడా సూచించింది. అయితే, ఈ ప్రకటన కార్మికులకు ఎటువంటి ఊరట ఇవ్వలేకపోయింది. యజమానులు కూడా ప్రభుత్వ ప్రకటనను ఖాతరు చేయకుండా కార్మికులను దోపిడి చేసేందుకే ప్రయత్నించారు. అనేక చోట్ల కార్మిక సంఘాలను సైతం గుర్తించలేదు. దీంతో కార్మికుల ఆందోళనలు తీవ్రమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు ఎక్కడికెళ్లినా ఈ చట్టం గురించే కార్మికులు ప్రశ్నించేవారు. ఈ పరిస్థితుల్లో కార్మిక శాసనం రూపొందించడానికి మద్రాసు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అప్పటికే ఉనికిలో ఉన్న వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు చర్చించుకుని విశాల ప్రాతిపదికన ఒక నివేదికను రూపొందించారు. 1939 మే 12న అప్పటి కార్మిక మంత్రి వివి గిరిని కలుసుకుని ఆ నివేదికను అందచేశారు. ఆ నివేదికలోని అంశాలను శాసనంలో పొందుపర్చాలని కోరారు. ఎనిమిది గంటల పనిదినం, వృద్ధాప్యం, అనారోగ్యం, అనాథ స్థితిలో ఉన్న కార్మికులకు జీవనోపాధి ఏర్పాటు చేయాలని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పని షరతులను నిర్ధారించాలని, షాపు, అసిస్టెంట్ సర్వీసు షరతులను న్యాయ సమ్మతంగా అమలు చేయాలన్నవి తక్షణ డిమాండ్లుగా ఈ నివేదికలో పేర్కొన్నారు.

# సొంత ఆయిల్ ఉత్పత్తిపై భారత్ దృష్టి




న్యూఢిల్లీ,: భారత్ ప్రపంచంలో చమురు వినియోగ దేశాల్లో రెండోస్థానంలో ఉంది. మొదటిస్థానంలో చైనా ఉంది. భారత్ 90 శాతం చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్?రష్యా యుద్ధంతో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యా ఆయిల్ దిగుమతులు నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో మిత్రదేశమైన రష్యాకు భారత్ అండగా నిలిచింది. మరోవైపు రష్య కూడా బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఇంధనం సరఫరా చేస్తోంది. అయితే దీనిని అమెరికా జీర్ణించుకోవడం లేదు. ఈ కరణంగానే అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఇంకా విధిస్తామని బెదిరిస్తున్నాడు. మరోవైపు వెనుజువెలా ఆక్రమణ నేపథ్యంలో రష్యాలోని షెల్ ఆయిల్‌ను భారత్‌కు సరఫరా చేయాలని ప్లాన్ వేస్తున్నాడు. ఈ క్రమంలో భారత్ వైవిధ్యమైన మార్గాలు అన్వేషిస్తోంది. ఇంధన భద్రతను బలోపేతం చేస్తోంది. తాజాగా యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ పర్యటన సందర్భంగా మోదీతో కీలక చర్చలు జరిపారువెనెజువెలాలోని 'సాన్ క్రిస్టోబల్' ప్రాజెక్టుల్లో ఓఎన్జీసీకి పెద్ద వాటాలు ఉన్నాయి. 600 మిలియన్ డాలర్ల లాభాలు చమురు రూపంలో అందుతాయి. కానీ అక్కడి ముదురో ప్రభుత్వం కూలిపోవడంతో ఇప్పుడు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గయానాలో 11 బిలియన్ బ్యారెళ్ల నిల్వల్లో ఓఎన్జీసీ, రిలయన్స్ 2026 వేలంలో పాల్గొని ఉత్పత్తి హక్కులు సాధించబోతున్నాయిరష్యాలో ఓఎన్జీసీకి సాఖాలిన్?1లో 20%, వాంకోర్ క్షేత్రంలో 26% వాటాలు. 2009లో టామ్స్క్ ప్రాంతంలో ఇంపీరియల్ ఎనర్జీని పూర్తిగా స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాజెక్టులు భారత ఇంధన అవసరాలకు స్థిరమైన మద్దతు.అబుదాబిలో బీపీసీఎల్, ఐవోసీ కలిసి ఃఉర్జా భారత్' సంస్థ ఆన్‌షోర్ బ్లాక్?1లో చమురు కనుగొన్నాయి. తాజాగా ఎక్స్ఎన్?76 (షిలైఫ్) బావిలో తేలిక ముడి చమురు, ఎక్స్ఎన్?79 (హబ్షాన్)లో కొత్త నిక్షేపాలు లభించాయి. 6,162 చ.కి.మీ. విస్తీర్ణంలో 100% హక్కులతో పూర్తి ఉత్పత్తి అనుమతి. 2019 నుంచి సాగుతున్న అన్వేషణ దశ ముగిసి, భారీ పెట్టుబడులతో తవ్వకాలు మొదలయ్యాయి. యూఏఈ ఇంధన ఉత్పత్తిలో కూడా ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద భాగస్వామిగా మారింది.సౌదీ సరఫరాలు, రష్యా?వెనెజువెలా?గయానా ప్రాజెక్టులు, అబుదాబి ఉత్పత్తి ? ఇవి భారతాన్ని దిగుమత ఆధారాల నుంచి స్వావలంబన వైపు నడిపిస్తున్నాయి. అమెరికా ఒత్తిడికి భారత్ స్వయం సమృద్ధి మార్గం ఎంపిక చేసుకుంది.

# పెద్దిరెడ్డికి బౌండరీస్..

**తిరుపతి,,తెలంగాణ దిశ :**అధికారంలో ఉన్నప్పుడు అన్నీ కలిసి వస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నేతల బలాలు తెలుస్తాయి. ఇప్పుడు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిస్థితి అదే. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆయన రాయలసీమకు ముఖ్యమంత్రిగా వ్యవహరించేవారు. రాయలసీమ పరిధిలోని నాలుగు జిల్లాలు ఆయన కంట్రోల్లో ఉండేవి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీనియర్ కావడం.. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డికి సన్నిహితుడు కావడంతో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు రామచంద్రారెడ్డి. చంద్రబాబుకు సమకాలీకుడు కావడంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తన చెంత ఉంచుకున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. 2014లో రాయలసీమలో వైసీపీ హవా నడిచింది. 2019లో క్లీన్ స్వీప్ చేసింది. అంతవరకు ఓకే కానీ.. 2024 ఎన్నికల్లో అదే రాయలసీమలో ఏడు స్థానాలకు పడిపోయింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. దీంతో అదంతా హవా తప్ప పెద్దిరెడ్డి లాంటి సీనియర్ల ప్రమేయం లేదన్న నిర్ధారణకు వస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.సొంత జిల్లా చిత్తూరులోపెద్దిరెడ్డి కంట్రోల్లో ఉండేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడ భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్కే రోజా లాంటి నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. పెద్దిరెడ్డి పెద్దరికాన్ని అయిష్టంగానే గౌరవించేవారు. దానికి కారణం జగన్మోహన్ రెడ్డితో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం. అయితే ఇప్పుడు మాత్రం సీన్ మారింది. ముఖ్యంగా నగిరి నియోజకవర్గ విషయంలో రోజా పట్టు బిగిస్తున్నారు. తన నియోజకవర్గంలో పెద్దిరెడ్డి మనుషుల పెత్తనాన్ని సహించుకోలేకపోయారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయేది. కానీ ఇప్పుడు మాత్రం పెద్దిరెడ్డి ప్రమేయాన్ని ఎంత మాత్రం సహించడం లేదు. పెద్దిరెడ్డి మనుషులను పార్టీ నుంచి బయటకు పంపుతారా? లేకుంటే తానే వెళ్లిపోమంటారా అంటూ రోజా గట్టిగానే హెచ్చరించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి తో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి జగన్ వద్ద ప్రాధాన్యత లభిస్తున్నట్లు సమాచారం. చెవిరెడ్డి అరెస్టు జరిగిన తర్వాత ఏ నేతకు లేనంత ప్రాధాన్యత ఆయనకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అసలు జైలుకెళ్లిన పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిని జగన్ కలుసుకునేందుకు కూడా ఇష్టపడలేదట.

# సీబీఐ కీలకం

కడప,తెలంగాణ దిశ : వైఎస్ వివేకానంద రెడ్డిహత్య కేసు మరోసారి తెరపైకి వచ్చింది.. సిబిఐ ఇప్పటికే విచారణ పూర్తి చేసినట్లు చెప్పిన నేపథ్యంలో కొన్ని రకాల అనుమానాలు వ్యక్తం చేస్తూ వైయస్ సునీత ఇదే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ట్రయల్ కోర్టులో పిటిషన్ వేయాలని సూచించడంతో ఆమె కింది కోర్టును ఆశ్రయించారు. అయితే ఆమె లేవనెత్తిన అనుమానాలు, ఆపై నిందితులుగా భావిస్తున్న వారిని విచారించకుండానే సిబిఐ దర్యాప్తు పూర్తి అవ్వడాన్ని ప్రస్తావించారు. కానీ కింది కోర్టు అవేవీ పరిగణలోకి తీసుకోలేదు. దీంతో మళ్లీ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈరోజు విచారణ జరగగా కోర్టు ఆసక్తికరమైన అంశాలను సిబిఐ ని అడిగి తెలుసుకుంది. వచ్చేనెల ఐదుకు విచారణను వాయిదా వేసింది. ప్రధానంగా ఈ కేసులో దర్యాప్తు పూర్తిస్థాయిలో ముగిసింది అని సిబిఐ కోర్టుకు చెబితే.. సుప్రీంకోర్టు ఈ కేసును ఒక కొలిక్కి తెచ్చే అవకాశం ఉంది. సిబిఐ దర్యాప్తు పూర్తిగా జరిగిందా? ఇంకేమైనా దర్యాప్తు చేయాల్సి ఉందా? అని అడిగింది కోర్టు. అయితే సునీత మాత్రం జగన్మోహన్ రెడ్డి దంపతులకు ముందుగానే ఎలా తెలిసింది అనేది సందేహం వ్యక్తం చేస్తూ వచ్చారు. అదే కీ పాయింట్ అని చెప్పుకొచ్చారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు గురయ్యారని జగన్మోహన్ రెడ్డి దంపతులకు ఎవరు చెప్పారు అన్నది సునీత సందేహం. రాజకీయ కోణంలోనే ఈ హత్య జరిగిందని ఆమె ఆది నుంచి సందేహంవ్యక్తం చేస్తూవచ్చారు. అయితేసుప్రీంకోర్టు ఆదేశాలతో ట్రైల్ కోర్టుకు సునీతరాగా.. అందరూ కుటుంబ సభ్యులు కావడం వల్లే సమాచారం ఇచ్చి ఉంటారని కోర్టు అభిప్రాయ పడింది. అయితే దీనితో ఏకీభవించలేదు సునీత. అందుకే మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు సుప్రీంకోర్టు సిబిఐ అభిప్రాయం అడిగింది. అంటే వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక ఘట్టం ఆసన్నం అయిం దన్నమాట. ఇప్పుడు సిబిఐ తన మనసులో ఉన్న మాటను కచ్చితంగా చెప్పాల్సిందే. సీరియస్ గా విచారణ చేపట్టామని చెప్పాలి. లేకుంటే కొంతమందినివిచారణ చేయాల్సి ఉందని చెప్పాలి. కానీ ఏదో ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పాలి. అప్పుడే అత్యున్నత న్యాయస్థా నం సంచలన తీర్పు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ సిబిఐ మళ్లీ దర్యాప్తును కోరితే మాత్రం అత్యున్నత న్యాయస్థానం సమ్మతించే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు సిబిఐ ఏమి చెబుతోం ది అనేది హాట్ టాపిక్. ఆ విషయం వచ్చే నెల 5న తేలనుంది.

# జెకె -5 ఓసీ కొనసాగించి నిర్వాసితులకు న్యాయం చేయాలి



## జాయింట్ కలెక్టర్ ను కలిసిన సర్పంచ్ లు, అఖిలపక్ష కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో న్యాయం జరిగినాడే ఖాళీ చేస్తాం

**కొత్తగూడెం,తెలంగాణ దిశ :** ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి ఇల్లందు ఏరియాలో గల జెకె -5 ఉపరితల బొగ్గగనిని కొనసాగింప చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆ ప్రాంత నిర్వాసితులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీన్ వెన్స్ డే లో విజయలక్ష్మి నగర్ తిలక్ నగర్ సర్పంచులు వినతి పత్రాన్ని అందజేశారు. పూర్తిస్థాయిలో న్యాయం జరిగిన నాడే ఆ స్థలాలను ఖాళీ సర్పంచులు చాందవ రమేష్ బాబు, ధనసరి స్రవంతి, ఆధ్వర్యంలో 21 అఖిలపక్ష కమిటీ నాయకులు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ని కలిసి కోరారు. కాగా తమ ముత్తాతలు, తాతలు , తండ్రులు సింగరేణి కి సేవలందించి రిటైర్అయి ఇక్కడే నివాసం ఉంటున్న మమ్మల్ని తక్షణమే ఖాళీ చేయాలని అధికారుల ఆదేశాలు ఇవ్వడం సరైంది కాదని ఆ వినతిపత్రం పేర్కొన్నారు. అంతేగాక ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా వెంటనే ఖాళీ చేయాలని సింగరేణి యాజమాన్యం తమపై ఒత్తిడి తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా తక్షణమే ఈ సమస్యపై స్పందించి తమకు న్యాయం చేయాలని వారు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు, అఖిలపక్ష కమిటీ నాయకులు ఓసీ విషయం పై జాయింట్ కలెక్టర్ కు వివరిస్తూ దాదాపు 130 ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నామని పేర్కొన్నారు. అయితే ఇక్కడున్న ప్రజలందరూ మాజీ కార్మికుల కుటుంబ సభ్యులేనని, ఆనాడు సింగరేణి కి సేవలు అందించి,ఎటు వెళ్లలేని పరిస్థితిలో ఇక్కడే నివాసముండిపోయామని ఆ వినతిపత్రంలో వివరించారు. దాదాపు 20, 30 సంవత్సరాల నుండి ఈ ప్రాంతాలను సింగరేణి ఎలాంటి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యానికి గురి చేసిందని, ప్రాజెక్టు కోసమని మా స్థలం మాకు కావాలని దౌర్జన్యానికి పాల్పడుతుందని వాపోయారు. జెకె 5 ఓ సి కొనసాగింపులో భాగంగా 21 ఫిట్ ఏరియా నిర్వాసిత ప్రాంతాలైన విజయలక్ష్మి నగర్,ఇతర ప్రాంత ప్రజలను ఉన్నపలంగా ఖాళీ చేయాలని ఎలాంటి నోటీసులు లేకుండా తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఎలాంటి సమాచారం లేకుండా ఖాళీ చేయమని సింగరేణి అధికారులు ఇంటింటికి తిరుగుతూ చెబుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించి గతంలోని చట్ట ప్రకారం మాకు రావలిసినవి ఇవ్వాలి అని అఖిలపక్షం చేపిందని వివరించారు. అంతేగాక నిర్వాసితులకు రావాల్సిన నష్టపరిహారాన్ని ఇచ్చిన తర్వాతనే ఖాళీ చేస్తామని స్పష్టంగా సింగరేణి యాజమాన్యానికి తెలియజేయడం జరిగిందని కలెక్టర్కు అందించిన వినతిపత్రంలోపేర్కొన్నారు.సింగరేణి అధికారులు అఖిలపక్ష కమిటీ వద్దకు వచ్చి సహకరించాలని కోరినప్పటికీ మేము ప్రాజెక్టు స్వాగతిస్తూనే ప్రజలకు న్యాయం చేయాలని ప్రార్థించామని తెలిపారు. అంతేగాక గతంలో చెప్పిన కొన్ని డిమాండ్లను వారు అంగీకరించి మా సహకారంతో సర్వే మొత్తం పూర్తి చేసుకొని ఈరోజు ఆ మాటలను తుంగలో తొక్కి వెంటనే ఖాళీ చేయాలని హుకుం జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ న్యాయమైన డిమాండ్లు ఇలా ఉన్నాయి. జెకె 5 ఓసీ లో ఏదైతే నిర్వాసితులకు ఇచ్చిన విధంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని జెకె 5 ఉపరితలం గని కొనసాగింపులో నిర్వాసితులకు ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అంతేగాక నిర్వాసిత కుటుంబంలోని ప్రతి వ్యక్తికి న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఇచ్చిన విధంగా అన్ని సదుపాయాలని సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయాలన్నారు. నూతన ఇల్లు కట్టే వరకు నిర్వహస్థితులకు అకామిడేషన్ ఇప్పించాలన్నారు. రెండు గ్రామ గ్రామపంచాయతీలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో నివాసం ఉంటున్న సొంతిల్లు కట్టుకున్న ప్రజలకు రెవెన్యూ కు అప్పగించి పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కోటర్స్ ను నివాసముంటున్న ప్రజలకు అప్పజెప్పి అదే విధంగా సింగరేణి కరెంటు తీసి ప్రభుత్వ కరెంటు ఇచ్చే విధంగా సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ కి వివరించారు. దీంతో జాయింట్ కలెక్టర్ పూర్తి వివరాలతో రావాలని సింగరేణి అధికారులకు లెటర్ పంపిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తాండ్ర నాగరాజు, ఎట్టి హరికృష్ణ, వడ్రల శ్రీను, క్లింట్ రోచ్, తేజవత్ లాలు,సదారం చిన్నారి, ధనసరి రాజు, బానోత్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడిలలో సౌకర్యాలు మెరుగుపడటానికి కృషి

## కార్పొరేటర్ కొత్వాల విమలా దేవి



**పాల్వంచ ,తెలంగాణ దిశ :** అంగన్వాడిలలో సౌకర్యాలు మెరుగుపడటానికి కృషి చేస్తానని పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. పాత పాల్వంచ 46 వ డివిజన్ లోని అంగన్వాడీ కేంద్రాన్ని విమలాదేవి పరిశీలించారు. బడికి సంసిద్దత కార్యక్రమం చేపట్టి, పిల్లలతో, తల్లితండ్రులతో మాట్లాడారు. పిల్లల ఎత్తు, బరువు తూకాలను పరిశీలించారు. బాలామృతం, కోడి గుడ్డు, పల్లీ చిక్కీస్ పంపిణీ చేశారు. కేంద్రం నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విమలా దేవి మాట్లాడుతూ అంగన్వాడీల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నిర్వాహకులు జి. పద్మ, పి. నాగమణి, పి. రాజ్యలక్ష్మి,ఆర్. పి యాటా అరుణ, వార్డు ఆఫీసర్ దామెర్ల నరేష్, ఆయా నాగలక్ష్మి, కాలనీవాసులుమసనం శరత్, బూసి శ్రీను, గడదాసు నాగలక్ష్మి, దాడి కృష్ణవేణి, డి.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## పిఎం సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను..

# సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి ,తెలంగాణ దిశ :**ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం లో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన పథకంపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను జిల్లాలో అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఇళ్ల పైభాగంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని, స్వయం విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగం పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు . అదనంగా, వినియోగించని విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి తిరిగి ఆదాయం పొందే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒక కోటి కుటుంబాలకు ప్రతి నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం లక్ష్యమని వెల్లడించారు. సబ్సిడీ వివరాలను తెలియజేస్తూ, 2 కిలోవాట్ వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.30,000, 3 కిలోవాట్ మరియు అంతకంటే



ఎక్కువ సామర్థ్యంపై అదనంగా రూ.18,000 సబ్సిడీ అందించబడుతుందని తెలిపారు. పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, విద్యుత్ బిల్, బ్యాంక్ పాస్‌బుక్, ఫోటో అవసరమని తెలిపారు. అర్హులైన వినియోగదారులు అధికారిక వెబ్‌సైట్ pmsuryaghar.gov.in లో నమోదు చేసుకుని రాష్ట్రం, విద్యుత్ పంపిణీ సంస్థ, కస్టమర్ నంబర్ తదితర వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్సీ జి. మహేందర్, టీజీఆర్‌ఈడీసీఓ జిల్లా మేనేజర్ పి. అజయ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యా సంవత్సరం గాను..

# ముందస్తు విద్యార్థుల నమోదుకై ర్యాలీ

## ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి మహేందర్

**హుస్నాబాద్,తెలంగాణ దిశ :**సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి మహేందర్ ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్సరంగాను ముందస్తు విద్యార్థుల నమోదుకై పట్టణ ంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 11వ,వార్డు 15వ వార్డు 17వ వార్డులో పర్యటించడం జరిగింది. 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురుకుల పాఠశాలలకు తీసిపోని సౌకర్యాలు ఉన్నాయని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యా యుల పిల్లలనుకూడా ప్రభుత్వ పాఠశాలలోచదివించే విధంగా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. 17వ, వార్డు కౌన్సిలర్ గాదపాక రవీందర్ మాట్లాడు తూ పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హుస్నాబాద్ మండలంలో అత్యుత్తమ మైన ప్రమా ణాలతో అన్ని సౌకర్యాలతో ఉన్నఏకైక పాఠశాల అనిఅన్నారు. ప్రజల ఒదరూ వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థిక భారం పెంచుకోవడం తప్ప ఏమీ లేదని, అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలని అన్నారు. 15వ,వార్డు కౌన్సిలర్ ఆకుల రజిత వెంకన్న





మాట్లాడుతూ పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆధునాతనమైన సైన్స్ ల్యాబ్, ఐటి/ఐటిఈఎస్, ఆటోమోటివ్ లాంటి ఏ పాఠశాలలో లేని ఒకేషనల్ కోర్సు,కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉచిత విజ్ఞాన యాత్ర, ఇండస్ట్రియల్ టూర్స్, కరాటే, యోగ, ఉచిత నోట్ బుక్స్,టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్, రుచికరమైన మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన,పరిశుభ్రమైన డైనింగ్ హాల్, మినరల్ వాటర్, డిజిటల్ క్లాసెస్, స్పోర్ట్స్,ప్రతి సంవత్సరం విద్యార్థులకు సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్స్, లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్స్ తోపాటు పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే వసతులు కేవలం పిఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోనే ఉన్నాయని అలాగే రాబోయే సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం ఉదయం అల్పాహారం షూ,టైస్, బెల్ట్స్, అందజేస్తుందని ఇన్ని సౌకర్యాలు ఉన్న పాఠశాలల లో మీ యొక్క పిల్లలను చేర్చి ప్రభుత్వం కల్పించే అన్ని వసతులను ప్రజలు వినియోగించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు జి.నరేందర్ పి లక్ష్మయ్య ఎస్ రవీందర్ పి రాజయ్య వి.యుగంధర్ రెడ్డి, బి.మనో హర్, జి.రవీందర్, సత్య నారాయణ రెడ్డి,ఎం. వనమాల, కే.శ్వేత టి.నవీన్ కుమార్ ఏ.రేణుక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీనగర్ కవల ఆడపిల్లల హత్య కేసు ఛేదన

**కరీంనగర్,తెలంగాణ దిశ :** సొంత బిడ్డలనే కాలయముడిలా మారి బావిలో ముంచి చంపిన దారుణ ఘటనలో కన్నతండ్రి తో పాటు అతనికి సహకరి ంచి న కుటుంబ సభ్యులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.ఆస్తిపై మక్కువ తో,ఆడపిల్లలనే వివక్షతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు విచారణలో వెల్లడైంది. ?ఘటన నేపథ్యం:?కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్ నివాసి కచ్చు శ్రీశైలం (28), ప్రతిమ మెడికల్ కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 2020లో మౌనికతో ఇతనికి వివాహం కాగా,2022లో వీరికి కవల ఆడపిల్లలు (గీతంశి,గీతన్విక) జన్మించారు. అయితే మొదటి నుండి మగపిల్లవాడు కావా లని కోరుకున్న శ్రీశైలంకు, ఆడపిల్లలు పుట్టడం ఇష్టం లేదు.సుమారు 2 కోట్ల విలు వైన ఆస్తి ఆడపిల్లల పెళ్లిళ్లకే సరిపోతుందని భావించిన శ్రీశైలం,తన తల్లిదండ్రులు అశోక్,లావణ్య మరియు తమ్ముడు రాకేష్‌తో కలిసి పిల్లలను అడ్డు తొలగించుకో వాలని పథకం వేశాడు.

?పథకం ప్రకారం హత్య: ఏప్రిల్ 3న,పథకం ప్రకారం నిందితుడు శ్రీశైలం తన భార్యను ఇంట్లోనే ఉండమని చెప్పి,బలవంతంగా ఇద్దరు కుమార్తెలను మోటార్ సైకిల్‌పై పొలం వద్దకు తీసుకెళ్లాడు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయం చూసి,నలుగురు నిందితులు ముందుగా అను కున్న ఒప్పందం ప్రకారం, శ్రీశైలం ఇద్దరు చిన్నారులను వ్యవసాయ బావిలోకి తోసివేశాడు.నీటిలో మునిగిపోతు న్న గీతంశి ప్రాణాల కోసం కొట్టుమిట్టాడుతుండగా,తనే బావిలోకి దిగి ఆమెను నీటిలో ముంచి ఊపిరాడకుండా చేసి చంపేశాడు.అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు,పిల్లలను కాపాడబోతు న్నట్లుగా నటిస్తూ కేకలు వేశాడు. విచారణ మరియు అరెస్ట్: నిందితుడి ప్రవర్తనపై అను మానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.రూరల్ సి.ఐ. నిరంజన్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులు గోపాల్‌పూర్‌లో తలదాచుకున్నట్లు గుర్తించా రు.ఆదివారం (ఏప్రిల్ 5) మధ్యాహ్నం నిందితులను అదుపులోకి తీసుకోగా,వారు తమ నేరాన్ని అంగీకరించారు. అరెస్టైన వారు: కచ్చు శ్రీశైలం (తండ్రి), కచ్చు అశోక్ (తాత), కచ్చు లావణ్య (నానమ్మ), కచ్చు రాకేష్ (బాబాయ్).



## చంద్రబాబు చేతిలో..

# ఐదూళ్ల భవిష్యత్

**- భద్రాచలం అభివృద్దికి ఐదూళ్లే ముఖ్యం**
**- మౌనంగా ఐదు మండలాలను కలుపుకున్న బాబు**
**- మంత్రి తుమ్మల లేఖతో మరోమారు తెరపైకి సమస్య**

**భద్రాచలం,తెలంగాణ దిశ :** భద్రాచలం అభివృద్దికి, నీటి మునక గండం నుంచి బయటపడడానికి ఇప్పుడు ఐదూళ్లు అవసరం గతంలో విభజన తరవాత ఏకపక్ష నిర్ణయంతో ఐదు మండలాలను ఎపిలో కలిపారు. భద్రాచలానికి ఆనుకొని ఉన్న 5 గ్రామాలను ఏపీ నుంచి వేరుచేసి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరుతోంది. గత కొన్నేళ్లుగా ఈ విషయంలో కేంద్రం నాన్చివేత ధోరణి అవలంబిస్తోంది. ఎపి ప్రభుత్వం కూడా అదే వైఖరితో ఉంది. ఐదు మండలాలను కలపడం వల్లనే పోలవరం సాధ్యం అయ్యిందని పదేపదే చెబుతున్న చంద్రబాబు ఈ విషయంలో పట్టువిడుపులు ప్రకటించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ది తనకు ముఖ్యమని ప్రకటించిన చంద్రబాబు ఈ విషయంలో మాత్రం పెదవి విప్పడం లేదు. చంద్రబాబు తలచకుంటే ఈ సమస్య చిటికెలో పరిష్కారం అవుతుంది. పరిపాలన సౌలభ్యం కోసం ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేసి గిరిజనుల ఇబ్బందులు తొలగించాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిపిన యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలు పరిపాలనపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పదేపదే కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆ ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. తెలంగాణలోని రెండు భాగాల మధ్య ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాయి. మిగిలిన సరిహద్దులు గోదావరి నది, రిజర్వు ఫారెస్టు ప్రాంతాలతో చుట్టుముట్టు ఉన్నాయి. దీంతో పరిపాలనపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామ పంచాయతీలకు పోలవరం ముంపు సమస్యతో ఎలాంటి సంబంధం లేదు. కానీ పరిపాలన, జీవనోపాధి, ప్రజాసేవల కోసం ఆ గ్రామాల ప్రజలు భద్రాచలంపైనే పూర్తిగా ఆధారపడి ఉన్నారు. ఏపీలో కొనసాగటం వల్ల గత 12 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామాల్లోని గిరిజనులు తమ ఊళ్లను తెలంగాణలోనే కలపాలని ఎప్పటి నుంచో కోరుతున్నా, కేంద్రం కానీ, ఎపి కానీ పట్టించుకోవడం లేదు. ఇక, ఆ గ్రామాల ప్రజలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 282 కిమీల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఇందుకోసం 8 గంటల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. మరోపక్క, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రం కేవలం 40 కిమీల దూరంలో ఉన్నదని, గంటలో జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. ప్రస్తుత సరిహద్దుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, అవసరమైన సరుకులు తరలించేటప్పుడు తరుచుగా తనిఖీలు, అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతం ఛత్తీస్‌గఢ్- ఒడిసా రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో పోలీసింగ్, శాంతిభద్రతల సమస్యలు కూడా తలెత్తుతున్నదని ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం తెలంగాణలో ఉండగా,ఈ ఆలయానికి సంబంధించిన కొన్ని భూ ములు ప్రస్తుతం పురుషోత్తపట్నం ప్రాంతంలో ఉన్నాయి. ఈ దేవాలయ భూముల విషయంలో గతంలో అక్కడికి వెళ్లిన మహిళా ఇవోపై దాడి జరిగింది. ఇది శాంతిభద్రతల సమస్యగా మారింది. దేవాలయ నిర్వహణ సులభంగా ఉండేందుకు ఈ భూభాగాలను తిరిగి తెలంగాణలో కలపటం అత్యవసరం కూడా. ఈ భౌగోళిక సమస్య కొనసాగితే భద్రాచలం దేవాలయం అభివృద్ధి ప్రణాళికకు ఆటంకం ఏర్పడుతుందని ప్రభుత్వ వర్గాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాక, ఆ ఐదు గ్రామాలు ఐదో షెడ్యూలులో ఉండటంతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు గిరిజనులకు అందటం లేదని గిరిజన నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ ఐదు గ్రామ పంచాయతీలు, 19 రెవెన్యూ గ్రామాలు తిరిగి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి కలపాల్సిన అసవరం ఉఎంతైనా ఉందని. కేంద్ర మంత్రి అమిత్‌షాకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఈ నెల 16 నుంచి జరగబోతతు న్నాయి. ఈ సమావేశాలు జరుగుతున్న నేపథ్యం లో.. ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన ఓ లేఖ రాశారు. ఆ ఐదు గ్రామాల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదివరకే ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు కనుక నిర్ణయం తీసుకుంటే సమస్య సులువుగా పరిష్కారం అవుతుం ది. అందుకు ఆయన సానుకూలంగా ముందుకు రావాల్సి ఉంది.




# వరుస ఫ్లాప్స్ తర్వాత రామ్ కొత్త ప్రయోగం



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని వరుస పరాజయాలతో సతమతమవుతున్నప్పటికీ, మళ్లీ బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని గట్టి నిర్ణయంతో ముందుకెళ్తున్నారు. ఇటీవల భారీ అంచనాల మధ్య విడుదలైన 'డబుల్ ఇస్మార్ట్', 'ఆంధ్ర కింగ్' వంటి చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, తన తదుపరి సినిమాల విషయంలో రామ్ మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటి వరకు చేసిన రొటీన్ మాస్ సినిమాలకు భిన్నంగా, కొత్తదనం ఉన్న కథలను ఎంపిక చేసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావాలని రామ్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ సెన్సేషనల్ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ సినిమాను ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ వద్ద శిష్యరికం చేసిన ఓ అసిస్టెంట్ డైరెక్టర్ తెరకెక్కించబోతున్నాడని సమాచారం. లోకేష్ సినిమాలకు ప్రత్యేకమైన ఇంటెన్సిటీ, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే ఎలా ఉంటాయో తెలిసిందే. అదే స్టైల్‌లో ఈ సినిమా కూడా పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందనుందని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రం ద్వారా రామ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించేందుకు దర్శకుడు ప్రయత్నిస్తున్నాడని తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు మరో పెద్ద ప్లస్ పాయింట్ మ్యూజిక్. ప్రస్తుతం సౌత్ ఇండియాలో టాప్ మ్యూజిక్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్న అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారని సమాచారం. అనిరుధ్ అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సాంగ్స్ సినిమాకు ప్రత్యేక హైప్ తీసుకురావడం ఖాయం. రామ్ ఎనర్జీకి అనిరుధ్ మ్యూజిక్ జతకలిస్తే థియేటర్లలో మంచి స్పందన రావడం ఖాయం అని అభిమానులు భావిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ రామ్ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలవొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. త్వరలోనే ఈ క్రేజీ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మొత్తానికి, వరుస ఫ్లాప్స్ తర్వాత రామ్ తీసుకుంటున్న ఈ కొత్త నిర్ణయం ఆయన కెరీర్‌కు ఎంతవరకు మలుపుతిప్పుతుందో చూడాలి. కొత్త దర్శకుడి విజన్, అనిరుధ్ సంగీతం కలిసి రామ్‌కు మళ్లీ సక్సెస్ అందిస్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది.

# పెద్ది' రిలీజ్‌పై వచ్చిన క్లారిటీ.. ఏప్రిల్ 30కే గ్రాండ్ ఎంట్రీ!




మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. 'రంగస్థలం' తర్వాత పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యంలో చరణ్ నటిస్తున్న చిత్రం కావడంతో అభిమానులు ఈ సినిమాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల శ్రీరామనవమి సందర్భంగా విడుదలైన 'పహిల్వాన్' గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించింది. చరణ్ మాస్ లుక్, ఆయన నటన మెగా అభిమానుల ను ఫుల్ జోష్‌లోకి తీసుకెళ్లింది. ఈ సినిమాతో బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా ఈ సినిమా రిలీజ్‌పై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. మొదటగా అనుకున్నట్టుగా ఏప్రిల్ 30న విడుదల కాకుండా జూన్‌కు వాయిదా పడుతుందని ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరిగింది. హనుమాన్ జయంతి సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో రిలీజ్ డేట్ ప్రస్తావించకపోవడం కూడా ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఇంకా సినిమా షూటింగ్ పూర్తి కావడానికి సుమారు 20 రోజులు ఉందని, ఒక ఐటెం సాంగ్ పెండింగ్‌లో ఉందని, పోస్ట్ ప్రొడక్షన్ సమయానికి పూర్తవుతుందా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రామ్ చరణ్ స్వయంగా క్లారిటీ ఇచ్చారు. 'రాకాస' సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న ఆయన, 'పెద్ది' వాయిదా పడటం లేదని స్పష్టం చేశారు. ప్లాన్ ప్రకారం సినిమా ఏప్రిల్ 30నే థియేటర్లలోకి వస్తుందని బలమైన సంకేతాలు ఇచ్చారు. ఇప్పటికే చిత్ర యూనిట్ వేగంగా పనులు పూర్తి చేస్తోంది. మిగిలిన షూటింగ్‌ను, ముఖ్యంగా ఐటెం సాంగ్‌ను, కేవలం వారం రోజుల్లో ముగించి ఫైనల్ అవుట్‌పుట్ సిద్ధం చేయడానికి మేకర్స్ కృషి చేస్తున్నారు. ఇక రిలీజ్‌పై వస్తున్న రూమర్లు కేవలం పుకార్లేనని డిస్ట్రిబ్యూటర్ల సమాచారం చెబుతోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఇప్పటికే ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఏప్రిల్ 8 నుంచి ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. దీంతో ఏప్రిల్ 30 రిలీజ్ దాదాపు ఖాయం అయిందని సినీ వర్గాలు అంటున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చియ్యమ్మ' పాత్రలో కనిపించనుండగా, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ 'గౌర్నాయుడు'గా, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ 'రాంబుజ్జి'గా నటిస్తున్నారు. అలాగే జగపతి బాబు 'అప్పలసూరి' పాత్రలో కీలకంగా కనిపించనున్నారు. వీరితో పాటుబొమన్ ఇరాని, సత్య తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంగీతాన్ని ఆస్కార్ విజేత రెహమాన్ అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రం రూపొందుతోంది.

# 'రామాయణ్'లో రణ్‌బీర్ డబుల్ రోల్



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ త్వరలోనే వెండితెరపై డబుల్ రోల్‌లో సందడి చేయబోతున్నారు. డైరెక్టర్ నితీష్ తివారీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ్'లో రణ్‌బీర్ రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించనున్నట్లు స్వయంగా ఆయనే వెల్లడించారు. ఇటీవలే హనుమాన్ జయంతి సందర్భంగా విడుదలైన 'రామ గ్లింప్స్'పై సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తోంది. ఈ గ్లింప్స్ విడుదలైన అనంతరం రణ్‌బీర్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను కేవలం శ్రీరాముడి పాత్ర మాత్రమే కాకుండా, విష్ణుమూర్తి మరో అవతారమైన మహర్షి పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు క్లారిటీనిచ్చాడు. దీంతో ఈ వార్త విన్న అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. శ్రీరాముడు ఒక అవతారమైతే, ఆయన కంటే ముందు వచ్చిన అవతారం పరశురాముడు. ఈ రెండు దివ్యమైన పాత్రలను ఒకే సినిమాలో చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఈ రెండు పాత్రల బాడీ లాంగ్వేజ్, స్వభావాలు వేరు. సినిమా షూటింగ్‌కు ముందు ఒక సంవత్సరం పాటు ఈ రెండు క్యారెక్టర్ల మూలాలను, వాటి వెనకున్న ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవడానికి చాలా కష్టపడ్డాను అని రణ్‌బీర్ పేర్కొన్నాడు. నమిత్ మల్హోత్రా దాదాపు రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్‌తో రెండు భాగాలుగా నిర్మిస్తున్న ఈ సినిమాలో సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా కన్నడ స్టార్ యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఈ భారీ విజువల్ వండర్ మొదటి భాగం 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మరోసారి అంతర్జాతీయ వేదికపై రష్మిక..



'నేషనల్ క్రష్' రష్మిక మందన్న తన క్రేజ్‌ను మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉన్న జపనీస్ యానిమేషన్ వేడుక 'క్రంచీరోల్ యానిమే అవార్డ్స్'లో ప్రజెంటర్‌గా వ్యవహరించేందుకు ఆమె ఎంపికయ్యారు. మే 23న జపాన్‌లోని గ్రాండ్ ప్రిన్స్ హోటల్ షిన్ టకనవాలో ఈ 10వ వార్షికోత్సవ వేడుక అట్టహాసంగా జరగనుంది.

రష్మిక ఈ వేదికపై ప్రజెంటర్‌గా కనిపించడం ఇది రెండోసారి కావడం విశేషం. ఈ విషయాన్ని రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. "మళ్లీ జపాన్‌కు.. యానిమే వెనుక ఉన్న అద్భుతమైన వ్యక్తులను సెలబ్రేట్ చేయడానికి వెళుతున్నా" అంటూ క్యాప్షన్ జోడించారు. 2024లో జరిగిన వేడుకలో తొలిసారి ప్రజెంటర్‌గా పాల్గొని, ఈ ఘనత సాధించిన మొదటి భారతీయ సెలబ్రిటీగా రష్మిక చరిత్ర సృష్టించారు.

ఇప్పుడు రెండోసారి కూడా అదే అవకాశం దక్కించుకోవడం ద్వారా గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఆమెకున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. ఈసారి వేదికపై ఆమెతో పాటు అసుకా సైతో, డానా పవోలా, విన్‌స్టన్ డ్యూక్ వంటి అంతర్జాతీయ ప్రముఖులు కూడా ప్రజెంటర్లుగా వ్యవహరించనున్నారు.

రష్మికకు యానిమేషన్ ప్రపంచంతో మంచి అనుబంధం ఉంది. 'జుజుట్సు కైసెన్', 'డీమన్ స్లేయర్' వంటివి తన ఫేవరెట్ అని ఆమె పలు సందర్భాల్లో చెప్పారు. ప్రస్తుతం భారతదేశంలో క్రంచీరోల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, రష్మిక ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి ఆమె నటించిన 'కాక్‌టెయిల్ 2' జూన్ 19న విడుదల కానుంది. చాలా కాలం తర్వాత భర్త విజయ్ దేవరకొండతో కలిసి రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో 'రణబాలి' అనే పీరియడ్ యాక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. వీటితో పాటు గిరిజన నేపథ్యంతో వస్తున్న 'మైసా' అనే యాక్షన్ డ్రామా వంటి భారీ చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి. ఇలా ఒకవైపు ప్రాంతీయ సినిమాల్లో అగ్రతారగా కొనసాగుతూనే, మరోవైపు గ్లోబల్ పాప్ కల్చర్‌లో తనదైన ముద్ర వేస్తూ రష్మిక ముందుకు సాగుతున్నారు.

# 'ఎల్లమ్మ'లో హీరోగా దేవి శ్రీ ప్రసాద్... దర్శకుడు వేణు ఎల్దండి సంచలన నిర్ణయానికి ఇదే కారణం!






'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్... ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించబోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా... కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం , భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు... 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు -- దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏది ఏమైన , వేణు ఎల్దండి తీసుకున్న ఈ ధైర్యవంతమైన నిర్ణయం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. 'ఎల్లమ్మ' సినిమా ద్వారా దేవి శ్రీ ప్రసాద్ నటుడిగా కూడా ప్రేక్షకులను మెప్పిస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215